SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267

సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న సమయం న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.

ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను. సీనియర్లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం ఉంటుంది.

ఫోన్ నెం : 99483 13985/ 89789 60131

సంపుటి : 18 సంచిక : 240 ఎడిటర్ : విక్రం కుమార్ శుక్రవారం 09 మే 2025 ప్రచురణ : హైదరాబాద్ పేజీలు: 8 వెల: రూ.5

## నైపుణ్య శిక్షణ..
## ఉద్యోగావకాశాలు

- జేఎన్‌టీయూహెచ్‌తో టీసీఎస్ అయాన్ ఒప్పందం
- తొలిదశలో 100 మంది విద్యార్థులకు 20 వారాల శిక్షణ
- శ్రీధర్‌బాబు సమక్షంలో ఒప్పందం



2లో



## పాక్ దుస్సాహసం..
# తిప్పికొట్టిన భారత్

- యుద్ధ విమానాలతో దాడికి పాక్ విఫలయత్నం
- జమ్మూ, రాజస్థాన్, పంజాబ్‌లపైకి ప్రయోగం
- విమానాశ్రయం, సైనిక కేంద్రాలే లక్ష్యం..
- ఆత్మాహుతి డ్రోన్లను ప్రయోగించిన శత్రు దేశం
- 3 ఫైటర్ జెట్లసహా అన్నింటినీ చిత్తుచేసిన భారత సైన్యం
- మనకు ఎటువంటి నష్టమూ జరగలేదు: రక్షణశాఖ
- ఉద్రిక్తతల నేపథ్యంలో సరిహద్దు రాష్ట్రాల్లో బ్లాక్‌అవుట్
- ఇళ్లలో నుంచి బయటకు రావొద్దని ప్రజలకు హెచ్చరిక

2లో

## మా జవాన్లు తలుచుకుంటే
## పాక్ ఉండదు

- భారత్ వైపు కన్నెత్తిచూస్తే నూకలు చెల్లినట్టే
- 'ఆపరేషన్ సిందూర్' వెనుక 140 కోట్ల మంది భారతీయులున్నారు
- ఉగ్రవాదానికి వ్యతిరేకంగా చేపట్టిన సంఘీభావ ర్యాలీలో సీఎం రేవంత్‌రెడ్డి




2లో

## ఆమె విజయ పరంపరతోనే
## ఆర్మీలో మహిళలకు శాశ్వత కమిషన్

- కర్నల్ సోఫియా ఖురేషీ ప్రతిభను ఐదేళ్ల క్రితమే ప్రశంసించిన సుప్రీంకోర్టు
- 2020 తీర్పులో ప్రత్యేక ప్రస్తావన

**మే 08, సమయం న్యూస్, ఢిల్లీ:** పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ముష్కరుల స్థావరాలపై భారత్ విరుచుకుపడిన తీరును మీడియా సమావేశంలో వివరించిన ఇద్దరు మహిళా సైనికాధికారులు యావత్ ప్రపంచ దృష్టినీ ఆకర్షించారు. కర్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ (ఐఏఎఫ్) ఎవరు, వారి నేపథ్యమేమిటో తెలుసుకునేందుకు అందరూ ఆసక్తి చూపారు. అయితే, ఐదేళ్ల క్రితమే సుప్రీంకోర్టు... కర్నల్ సోఫియా ఖురేషీ ప్రతిభను గుర్తించింది. సైన్యానికి ఆమె అందించిన విశిష్ట సేవలను ప్రత్యేకంగా ప్రశంసించింది. ఆర్మీలో తమకూ శాశ్వత కమిషన్ (పీసీ)

తరువాయి 2లో





## 14వ పోప్‌గా
## రాబర్ట్ ప్రివోస్ట్

- అమెరికాకు తొలి అవకాశం

మే 8, సమయం న్యూస్, రోమ్: ప్రపంచ వ్యాప్తంగా 140 కోట్లమంది కేథలిక్కులు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్న ఘడియ రానే వచ్చింది. వారికి ఆరాధ్యుడైన పోప్ ఎన్నిక ఎట్టకేలకు పూర్తయింది. అమెరికాకు చెందిన 69 ఏళ్ల రాబర్ట్ ప్రివోస్ట్‌ను తదుపరి పోప్‌గా ఎన్నుకున్నట్టు వాటికన్ వర్గాలు ప్రకటించాయి. పోప్‌గా ఓ అమెరికన్ ఎన్నికకావడం ఇదే ప్రథమం. రాబర్ట్ ప్రివోస్ట్‌ను ఇకపై 14వ పోప్ లియోగా వ్యవహరిస్తారు. సంప్రదాయం ప్రకారం పోప్ లియో సెయింట్ పీటర్స్ కూడలిలోని

తరువాయి 2లో

## ఏకైక రాజధాని అమరావతే



- ఈ మేరకు రాష్ట్ర విభజన చట్టానికి సవరణ చేయాలి
- కేంద్రాన్ని కోరుతూ మంత్రిమండలి తీర్మానం
- క్యాబినెట్ నిర్ణయాలు వెల్లడించిన మంత్రి పార్థసారథి

మే 08, సమయం న్యూస్, అమరావతి: 'రాష్ట్ర విభజన చట్టంలో ఆంధ్రప్రదేశ్‌కు ఏకైక రాజధాని అమరావతి అన్న పదాన్ని చేర్చాలి. ఈ మేరకు 2014లో చేసిన చట్టానికి సవరణ చేయాలి' అని రాష్ట్ర మంత్రిమండలి తీర్మానించింది. రాజధాని అమరావతికి 33 వేల ఎకరాలను రైతులు భూసమీకరణలో ఇచ్చారు. ఆ తర్వాత రాజధాని విషయంలో ఎన్నో పరిణామాలు చోటుచేసుకున్నాయి. చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడి, అమరావతి పునర్నిర్మాణం చేపట్టింది. ఈ నేపథ్యంలో రాజధానికి భూములు ఇచ్చిన రైతులు ముఖ్యమంత్రితో సమావేశమైనప్పుడు.. భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులూ రాకుండా ఆంధ్రప్రదేశ్‌కు ఏకైక రాజధానిగా అమరావతిని నిర్ణయిస్తూ విభజన చట్టానికి సవరణ చేయించాలని కోరారు. దీంతో ఈ అంశంపై చట్టసవరణ చేయాలని కేంద్రాన్ని కోరుతూ గురువారం జరిగిన మంత్రిమండలి సమావేశం తీర్మానించింది. 'జగన్ ప్రభుత్వంలో

తరువాయి 2లో

## అందాల పోటీకి
# ముస్తాబైన భాగ్యనగరి

- 109 దేశాల పోటీదారుల రాక.. సంప్రదాయ స్వాగతం
- రేపటి నుంచి గచ్చిబౌలిలో మిస్ వరల్డ్ పోటీలు
- ప్రారంభించనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- పేరిణి కళాకారిణులతో తొలి నృత్య ప్రదర్శన






**మే 08, సమయం న్యూస్, హైదరాబాద్:** తెలంగాణలో తొలిసారి జరగనున్న 72వ మిస్ వరల్డ్ 2025 పోటీలు అటు దేశానికి, ఇటు మన రాష్ట్రానికి విశ్వవేదికపై విశిష్ట గుర్తింపును తీసుకురానున్నాయి. ఈ పోటీల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం 'తెలంగాణ జరూర్ ఆనా' (తెలంగాణకు తప్పకుండా రండి) అనే నినాదాన్ని ప్రపంచవ్యాప్తంగా పరిచయం చేస్తోంది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో 10వ తేదీ సాయంత్రం 5 గంటలకు అధికారికంగా ప్రారంభమయ్యే వేడుకలు రాత్రి 8 గంటల వరకు కొనసాగుతాయి. వేడుకల్లో మన సంస్కృతి,

తరువాయి 2లో

## పాక్ దాడులకు
# దీటుగా జవాబిద్దాం...



- అఖిలపక్ష భేటీలో రక్షణమంత్రి రాజ్‌నాథ్ వెల్లడి
- ప్రభుత్వానికి మద్దతు ప్రకటించిన పార్టీల నేతలు

మే 08, సమయం న్యూస్, ఢిల్లీ: ఉద్రిక్తతల్ని పెంచాలని భారత్ అనుకోవడం లేదని, పాక్ దాడిచేస్తే మాత్రం దీటుగానే జవాబిస్తామని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లలో తొమ్మిది ఉగ్రవాద శిబిరాలపై సైన్యం చేసిన దాడుల్లో

తరువాయి 2లో

# పాక్ దుస్సాహసం.. తిప్పికొట్టిన భారత్

(మొదటిపేజీ తరువాయి)

కనీసం 100 మంది ఉగ్రమూకలను పెంచి పోషిస్తున్న పాకిస్థాన్ దుస్సాహసానికి ఒడిగట్టింది. రెచ్చగొట్టే ధోరణిని మళ్లీ ప్రదర్శించింది. గురువారం రాత్రి క్షిపణులు, ఆత్మాహుతి డ్రోన్లు, యుద్ధ విమానాలను మన దేశంపైకి ప్రయోగించింది. సరిహద్దు రాష్ట్రాలైన జమ్మూ కశ్మీర్, రాజస్థాన్, పంజాబ్‌లపైకి వాటిని వదిలింది. జమ్మూ విమానాశ్రయంతోపాటు సరిహద్దుల్లోని పలు సైనిక కేంద్రాలను లక్ష్యంగా చేసుకుంది. 35 నిమిషాలపాటు సాగిన ఈ ప్రయత్నాలను భారత్ సమర్థంగా తిప్పికొట్టింది. 8 డ్రోన్లను, 3 ఫైటర్ జెట్లను కూల్చేసింది. పాక్ పైలట్‌ను భారత సైన్యం బందీగా పట్టుకుంది. పాక్ దుస్సాహసంపై జాతీయ భద్రతా సలహాదారు అజీత్ డోభాల్ సమీక్షించారు. అనంతరం ఆయన పూర్తి వివరాలను ప్రధాని మోదీకి తెలియజేశారు. పాక్ దాడి తర్వాత ఫైసలాబాద్, సర్గోదాల్లోని ఆ దేశ రక్షణ వ్యవస్థలను భారత్ ధ్వంసం చేసింది. వాస్తవానికి బుధవారం రాత్రి నుంచీ దాడులకు ప్రయత్నిస్తున్న పాకిస్థాన్ క్షిపణులు, డ్రోన్లతో దాడిచేయడానికి 15 లక్ష్యాలను ఎంచుకుంది. దీన్ని ముందుగానే పసిగట్టిన భారత్ ఇంటిగ్రేటెడ్ కౌంటర్ మానవ రహిత ఎయిర్‌క్రాఫ్ట్ వ్యవస్థ (గ్రిడ్ అండ్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు)తో విజయవంతంగా అడ్డుకుంది. పాకిస్థాన్‌లోని పలు ప్రాంతాల్లోని గగనతల రక్షణకు సంబంధించిన రాడార్లను, వ్యవస్థలను భారత్ గురువారం ఉదయం ధ్వంసం చేసింది. పాక్ రాజధాని నగరం ఇస్లామాబాద్‌లో గురువారం సైరన్ల మోత మోగింది. అదే సమయంలో ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ కార్యాలయంలో సమావేశం జరుగుతుండటం గమనార్హం. గురువారం రాత్రి పాక్ మళ్లీ క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించింది.

* జమ్మూ, ఉధంపుర్, అఖ్నూర్, పూంఛ్, రాజస్థాన్‌లోని జైసల్మేర్, పోఖ్రాన్, పంజాబ్‌లోని పఠాన్‌కోట్, జలంధర్ లక్ష్యంగా పాక్ ఈ డ్రోన్లను ప్రయోగించింది.
* సత్వారా, సాంబా, ఆర్ఎస్ పురాల్లో క్షిపణి దాడులకు పాక్ ప్రయత్నించింది.
* జమ్మూ విమానాశ్రయం సహా పలు కీలక ప్రాంతాలవైపు డ్రోన్లు వచ్చాయి. దీంతో ప్రజలంతా వెంటనే ఇళ్లలోకి వెళ్లిపోయారు. దుకాణాలను మూసివేశారు. గగనతల రక్షణ వ్యవస్థ ఈ డ్రోన్లను విజయవంతంగా అడ్డుకుని కూల్చేసింది. జమ్మూ సిటీలో విద్యుత్తు సరఫరాను అధికారులు నిలిపేశారు. కమ్యూనికేషన్ వ్యవస్థలు మూగబోయాయి. జమ్మూలో పలు సైనిక కేంద్రాలున్నాయి. విమానాశ్రయంవద్ద భారీ శబ్దాలు వినిపించాయని స్థానికులు తెలిపారు.
* జమ్మూ యూనివర్సిటీకి సమీపంలో 2 పాక్ డ్రోన్లను భారత్ ధ్వంసం చేసింది.
* ఉరీలో పౌర నివాసాలే లక్ష్యంగా పాక్ దాడులకు తెగబడింది.
* జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రదాడులు చేయాలని టెర్రరిస్టులకు పాక్ ఐఎస్ఐ సూచించింది. దీంతో అనంత్‌నాగ్‌లోని ఖుంద్రూలో ఉన్న ఆయుధ డిపోవద్ద పేలుళ్లకు వారు పాల్పడినట్లు సమాచారం.
* ఉద్రిక్తతల దృష్ట్యా అఖ్నూర్, కిశ్త్‌వాడ్, సాంబా సెక్టార్లలో అధికారులు పూర్తిగా విద్యుత్ సరఫరాను నిలిపేశారు. జమ్మూ జిల్లా వ్యాప్తంగా సైరన్లు మోగిస్తున్నారు. ప్రజలు ఇళ్లలోనే ఉండాలని సైన్యం హెచ్చరికలు జారీ చేసింది.
* హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలలో ఐపీఎల్ మ్యాచ్‌ను భద్రతా కారణాలరీత్యా అర్ధంతరంగా రద్దు చేశారు.
* పలు రాష్ట్రాల్లో అధికారులకు సెలవులను ప్రభుత్వాలు రద్దు చేశాయి. విద్యా సంస్థలకు సెలవులిచ్చాయి.
* దిల్లీలో ప్రజలు ప్రముఖ ప్రదేశాల్లో తిరగడాన్ని నిషేధించారు.
* 'జమ్మూ, పఠాన్‌కోట్, ఉధంపుర్‌లను పాక్ డ్రోన్లు, క్షిపణులు లక్ష్యంగా చేసుకున్నాయి. వెంటనే వాటిని నిర్వీర్యం చేశాం. ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదు' అని రక్షణశాఖ అధికార ప్రతినిధి గురువారం రాత్రి తెలిపారు.
* అన్ని పారామిలిటరీ బలగాల డీజీలతో కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్వయంగా మాట్లాడారు. పరిస్థితిని సమీక్షించారు.

*** భారత సైనిక కేంద్రాలను పేల్చేశాం: పాక్**

సరిహద్దుల్లోని భారత సైనిక కేంద్రాలను పేల్చేశామని పాకిస్థాన్ సమాచారశాఖ మంత్రి అత్తావుల్లా తరార్ స్కైన్యూస్‌తోపాటు సీఎన్ఎన్‌కు తెలిపారు. 40 నుంచి 50 మంది భారత సైనికులు చనిపోయారని వివరించారు. దీనిని భారత్ తీవ్రంగా ఖండించింది. అన్ని డ్రోన్లను అడ్డుకున్నామని స్పష్టంచేసింది.

## మా జవాన్లు తలుచుకుంటే పాక్ ఉండదు

హైదరాబాద్; ఖైరతాబాద్ : ''మా దేశ సరిహద్దుల్లోకి చొచ్చుకు వచ్చిన ఉగ్రవాదులను ప్రోత్సహించిన పాకిస్థాన్ పాలకులారా... గుర్తుపెట్టుకోండి... మా వీర జవాన్లు తలుచుకుంటే ప్రపంచపటంలో పాకిస్థాన్ దేశం ఉండదు.. దొడ్డిదారిన దేశంలో ప్రవేశించి మా తల్లులు, ఆడబిడ్డల నుదుట సిందూరాన్ని తుడిచేశారు.. భారతీయులపై దాడులు చేస్తామంటూ ఉగ్రవాదులు విర్రవీగారు... వారికి మద్దతు ఇచ్చిన మీకు, ముష్కరులకు ఆపరేషన్ సిందూర్ ద్వారా బుద్ధిచెప్పాం.. ఈ మహత్ కార్యక్రమం వెనుక 140 కోట్ల భారతీయులున్నారు. ఉగ్రవాదుల పీచమణిచే వరకూ ఆపరేషన్ సిందూర్ కొనసాగుతుంది'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం గురువారం చేపట్టిన సంఘీభావ ర్యాలీలో త్రివర్ణ పతాకం చేతబూని ఆయన పాల్గొన్నారు. ముందుగా పోలీసులు, వేలమంది ప్రజలు, మాజీ సైనికులు, ఎన్‌సీసీ కేడెట్లు తదితరులు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయానికి చేరుకున్నారు. సాయంత్రం 6.45 గంటలకు సీఎం రేవంత్ త్రివర్ణపతాకం పట్టుకుని బయటకు రాగా ఆయనను అనుసరించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఐపీఎస్‌లు, ఐఏఎస్‌లు, ప్రభుత్వ అధికారులు... ఇలా అంతా సచివాలయం నుంచి నెక్లెస్‌రోడ్ రోటరీ వద్దకు చేరుకున్నారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. సచివాలయం నుంచి నెక్లెస్ రోటరీ వరకూ ర్యాలీ కొనసాగడంతో హుస్సేన్‌సాగర్ భావోద్వేగ సాగరంగా మారిపోయింది. ఇరవై నిమిషాలపాటు ర్యాలీలో నడిచిన సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, అధికారులు పహల్గాంలో ఉగ్రవాదుల కాల్పుల్లో మృతిచెందిన వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. నిమిషంపాటు మౌనం పాటించారు. అక్కడున్న వారందరి హృదయాలు భారమయ్యాయి.

**దేశ భద్రత విషయంలో ఎక్కడా రాజీపడబోం**

నివాళి అర్పించిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ పాకిస్థాన్ దుష్ట పన్నాగాలకు దీటైనరీతిలో భారత సైన్యం బుద్ధి చెబుతోందని అన్నారు. భారత ప్రజలంతా శాంతికాముకులని.. అది చేతగానితనం అనుకుంటే.. ఎవరైనా సరే వారి అంతుచూస్తామని, ఉగ్రవాదాన్ని తుదముట్టించేందుకు నాలుగుకోట్ల మంది తెలంగాణ ప్రజలు మద్దతుగా నిలుస్తారని వివరించారు. దేశ భద్రత విషయంలో ఎక్కడా రాజీపడబోమని, ఇలాంటి సందర్భాల్లో రాజకీయాలు, పార్టీలు, జెండాలు, ఎజెండాలకు అతీతంగా దేశ ప్రజలంతా ఏకమవుతామని అన్నారు.

**మా సహనాన్ని పరీక్షిస్తే...**

''బ్రిటిష్ పాలకుల చేతుల్లో ఎన్నో చిత్రహింసలు ఎదుర్కొని శాంతియుత నిరసనల ద్వారా మహాత్మాగాంధీ దేశానికి స్వాతంత్ర్యం తెచ్చారు. అదేసమయంలో పాకిస్థాన్‌కు కూడా స్వేచ్ఛావాయువులు పీల్చుకునే అవకాశం కల్పించాం. అప్పటి నుంచి ఇప్పటి వరకూ మనం పొరుగుదేశాలతో శాంతియుతంగా వ్యవహరిస్తుంటే.. పాకిస్థాన్ పాలకులు మనల్ని రెచ్చగొట్టేలా సరిహద్దుల్లో కవ్వింపు చర్యలకు పాల్పడుతూనే ఉన్నారు. మా సహనాన్ని పరీక్షిస్తే..ఎలా ఉంటుందో ఆపరేషన్ సిందూర్ ద్వారా మీకు సరైన సమాధానం చెప్పాం. మీరు మీ దుష్టపన్నాగాలు ఆపేంత వరకూ కొనసాగిస్తాం.. మా పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీలు ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలిసి ఇప్పటికే సంపూర్ణ మద్దతు ప్రకటించారు'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు.

## ఆమె విజయ పరంపరతోనే ఆర్మీలో మహిళలకు శాశ్వత కమిషన్

(మొదటిపేజీ తరువాయి)

అవకాశం కల్పించాలన్న మహిళా సైనికాధికారుల న్యాయపోరాటం సందర్భంగా.. కర్నల్ సోఫియా విజయపరంపర సర్వోన్నత న్యాయస్థానం దృష్టికి వచ్చింది. ఆమె సేవలను సోదాహరణగా చూపుతూ మహిళలూ ఆర్మీలో శాశ్వత కమిషన్‌కు అర్హులేనంటూ 2020 ఫిబ్రవరి 17న వెలువరించిన తీర్పులో విస్పష్టం చేసింది. అప్పటి వరకూ ఆర్మీలో మహిళా అధికారుల సేవలను షార్ట్ సర్వీస్ కమిషన్ (ఎస్ఎస్‌సీ)కే పరిమితం చేస్తున్న పరిస్థితి. మహిళల శారీరక స్వభావాన్ని, సామాజిక జీవన వాతావరణాన్ని సాకుగా చూపుతూ వారికి శాశ్వత కమిషన్‌ను నిరాకరిస్తున్నారు. ఈ వాదనలను సమర్థించలేమంటూ సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. 2016లో పుణెలో 'ఎక్సర్‌సైజ్ ఫోర్స్ 18' పేరిట నిర్వహించిన మల్టీనేషనల్ మిలిటరీ ఎక్సర్‌సైజ్‌లో భారత సైనిక దళానికి అప్పటి లెఫ్టినెంట్ కర్నల్ (ఆర్మీ సిగ్నల్ కోర్) సోఫియా ఖురేషీ నాయకత్వం వహించారు. ఆ బాధ్యతను చేపట్టిన తొలి భారతీయ మహిళగా నిలిచారు. ఐక్యరాజ్యసమితి పీస్‌మిషన్‌లో భాగంగా 2006లో కాంగోలో విధులు నిర్వహించారు. సోఫియా సాధించిన ఇతర విజయాలనూ ప్రస్తావిస్తూ సుప్రీంకోర్టు మహిళలకూ శాశ్వత కమిషన్ అర్హతను కల్పించింది.

## నైపుణ్య శిక్షణ.. ఉద్యోగావకాశాలు

హైదరాబాద్: ఇంజినీరింగ్ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు జేఎన్‌టీయూ హైదరాబాద్.. టీసీఎస్ అయాన్ కంపెనీ అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. 'ప్లేస్‌మెంట్ సక్సెస్ ప్రోగ్రామ్' కింద తొలిదశలో మంథని జేఎన్‌టీయూలో పైలట్ ప్రాజెక్టుగా ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తారు. 100 మంది విద్యార్థులను ఎంపిక చేసుకొని.. టీసీఎస్ అయాన్ 20 వారాల శిక్షణ ఇస్తుంది. అనంతరం ఈ సంస్థకు అనుబంధంగా ఉన్న 3 వేలకు పైగా కంపెనీలు.. శిక్షణ పొందినవారిలో ప్రతిభావంతులను ఎంపిక చేసుకొని ఉద్యోగావకాశాలు కల్పిస్తాయి. విద్యా సంస్థలకు.. పరిశ్రమలకు మధ్య అంతరాన్ని తగ్గించడంలో ఈ ఒప్పందం దోహదపడుతుందని ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. సచివాలయంలో శ్రీధర్‌బాబు సమక్షంలో జేఎన్‌టీయూహెచ్ ఉపకులపతి టి.కిషన్‌కుమార్‌రెడ్డి.. టీసీఎస్ అయాన్ బిజినెస్ హెడ్ (స్కిల్ ఎడ్యుకేషన్) స్మృతి ముల్యే ఎంఓయూపై సంతకం చేశారు. టీసీఎస్ అయాన్ గ్లోబల్ హెడ్ వెంగుస్వామి రామస్వామి టెలికాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

**మైలురాయిగా నిలుస్తుంది..**

గ్రామీణ యువతకు ఉద్యోగాలకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ అందించడంలో ఈ ఒప్పందం మైలురాయిగా నిలుస్తుందని మంత్రి చెప్పారు. ''భారతీయ యువతలో ఉద్యోగ నైపుణ్యాలు.. 2023లో 44.3 శాతం నుంచి 2024లో 42.6 శాతానికి తగ్గడం ఆందోళన కలిగించే అంశం. సగం మంది గ్రాడ్యుయేట్లు కూడా ఇప్పుడు ఉద్యోగ మార్కెట్‌లో డిమాండ్లకు తగ్గట్టుగా సిద్ధంగా లేరు. ఇది విద్యార్థులు, విద్యా సంస్థలు, పరిశ్రమలు, ప్రభుత్వం పనితీరును ప్రభావితం చేస్తుంది. రాష్ట్రంలో ఈ పరిస్థితి రాకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. టీసీఎస్ అయాన్‌తో కలిసి మంథని జేఎన్‌టీయూలో విద్యార్థులకు అవసరమైన సాంకేతిక శిక్షణ ఇచ్చి, ఉద్యోగాలకు పోటీపడేలా సిద్ధం చేస్తున్నాం. ఈ సంస్థకు అనుబంధంగా ఉన్న 3 వేలకు పైగా కంపెనీల్లో వారికి ఉద్యోగావకాశాలూ లభిస్తాయి. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' ద్వారా యువతకు నైపుణ్య శిక్షణ అందిస్తున్నాం'' అని శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీ శాఖ సలహాదారు సాయికృష్ణ, టీసీఎస్ సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

## ఏకైక రాజధాని అమరావతే

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రానికి ఏది రాజధానో తెలియక అందరూ ఇబ్బందులు పడ్డారు. భవిష్యత్తులో రాజధానికి ఎలాంటి ఇబ్బంది రాకుండా ఉండేందుకు ఈ చట్ట సవరణ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది' అని సమాచార, పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. మంత్రిమండలి నిర్ణయాలను తమ శాఖ సంచాలకులు హిమాన్షు శుక్లాతో కలిసి ఆయన విలేకర్లకు వెల్లడించారు. సీఆర్‌డీఏ చట్టంలో అమరావతి రాజధాని ప్రాంతంగా ఏయే ప్రాంతాలను పేర్కొన్నారో అవన్నీ అమరావతి రాజధానిగా ఉంటాయని చెప్పారు.

**మంత్రిమండలి నిర్ణయాలివీ..**

అమృత్ 2.0 పథకంలో రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థల్లో జల కార్యాచరణ చేపట్టేందుకు కేంద్రం 36.5% నిధులు ఇచ్చింది. వైకాపా ప్రభుత్వం వాటికి రాష్ట్ర వాటా నిధులు జత చేయకపోవడంతో కార్యక్రమం మూలనపడింది. ఈ పథకాన్ని వినియోగించుకునేందుకు హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీని ద్వారా రూ.6,777 కోట్లు ఖర్చు చేస్తారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ.2,947.67 కోట్లు ఇస్తుంది. మిగిలింది యాన్యుటీ పద్ధతిలో చేయాలని మంత్రిమండలి తీర్మానించింది. ఈ విధానంలో తీసుకున్న నిధులు 10.15% వడ్డీతో 40 వాయిదాల్లో ప్రాజెక్టు పూర్తయిన రెండేళ్ల తర్వాత తిరిగి చెల్లిస్తారు. దీని వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి రూ.1,350 కోట్ల లబ్ధి కలుగుతుంది.

రాష్ట్రంలో గుత్తేదారుల రిజిస్ట్రేషన్‌కు గత ఐదేళ్ల అనుభవం, టర్నోవర్ ఆధారంగా అర్హత నిర్ణయిస్తున్నారు. గత ఐదేళ్లలో రెండున్నరేళ్లు కరోనా వల్ల ఎలాంటి పనులు లేవు. ఆ తర్వాత వైకాపా ప్రభుత్వం సరిగా బిల్లులు చెల్లించలేదు. దీంతో గత ఐదేళ్ల లెక్కలు పరిగణనలోకి తీసుకుంటే సరైన మదింపు ఉండదని 10 ఏళ్ల కాలపరిమితిని తీసుకోవాలని మంత్రిమండలి తీర్మానం.

* జలహారతి కార్పొరేషన్‌కు ఛైర్మన్‌గా ముఖ్యమంత్రి, వైస్‌ఛైర్మన్‌గా జలవనరుల మంత్రి ఉంటారంటూ గతంలో ఇచ్చిన ఉత్తర్వుల సవరణ. ఇకపై జలవనరులశాఖ ఉన్నతాధికారులే ఛైర్మన్, వైస్ ఛైర్మన్లుగా ఉంటారు.
* 2025..26 ఆర్థిక సంవత్సరంలో భారీ, మధ్య తరహా, చిన్న నీటి వనరులకు రూ.345.39 కోట్లతో నిర్వహణ పనులు చేసేందుకు పాలనామోదం..
* రాష్ట్రపతి ఆమోదం కోసం 2019లో పంపిన పారిశ్రామిక వివాదాల సవరణ బిల్లు ఉపసంహరణకు నిర్ణయం.

**భూముల కేటాయింపులు**

వైఎస్సార్ జిల్లా కొండాపూర్ మండలం కె.బొమ్మేపల్లిలో అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ద్వారా వెయ్యి మెగావాట్ల పంప్డ్ హైడ్రో స్టోరేజ్ పవర్ ప్రాజెక్టు స్థాపించేందుకు ఎన్ఆర్ఈడీసీఏపీ (నెడ్‌కాప్)కి 191.64 ఎకరాలకు కౌలు చెల్లింపునకు నిర్ణయం. ఎకరానికి ఏడాదికి రూ.31 వేల కౌలు.. రెండేళ్లకోసారి 5% పెంపు. ప్రాజెక్టు నిర్మాణ, నిర్వహణ కాలం మొత్తం 46 సంవత్సరాలకు వర్తింపు.

## పాక్ దాడులకు దీటుగా జవాబిద్దాం

(మొదటిపేజీ తరువాయి)

కరడుగట్టిన ముష్కరులు, వారి అనుచరులను అంతమొందించామని వెల్లడించారు. అత్యంత కచ్చితత్వంతో భారత సైన్యం పనిచేసిందని కొనియాడారు. దీనికోసం ఉద్దేశించిన 'ఆపరేషన్ సిందూర్' కొనసాగుతోందని చెప్పారు. ఈ ఆపరేషన్ గురించి వివరించేందుకు గురువారం పార్లమెంటు గ్రంథాలయ భవనంలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి ప్రసంగించారు. దాడులు జరిపిన తీరును తొలుత ఆయన వివరించారు. వివిధ పార్టీలకు చెందిన నేతలు లేవనెత్తిన అంశాలకు సమాధానమిచ్చారు.

**అమాయకులకు నష్టం కలగనివ్వలేదు**

''దాడుల్లో అమాయకులకు నష్టం కలగకుండా చర్యలు తీసుకున్నాం. సైనికులు చూపిన ధైర్యసాహసాలు మనకు గర్వకారణం. నాణ్యమైన ఆయుధాలు మనవద్ద ఉన్నాయి. ఆయుధ తయారీలో చాలావరకు స్వయంసమృద్ధి సాధించి ప్రపంచ మార్కెట్‌లోకి అడుగుపెడుతున్నాం. ఆయుధ తయారీలో బ్రాండ్ భారత్ తనదైన గుర్తింపు పొందింది'' అని రాజ్‌నాథ్ తెలిపారు. రూ.24,000 కోట్ల మేర ఉన్న ఆయుధాల ఎగుమతి విలువను రూ.50,000 కోట్లకు తీసుకెళ్లాలని, భారత ఆయుధ సంపత్తి గొప్పదనాన్ని త్వరలోనే ప్రపంచం గుర్తిస్తుందని చెప్పారు. పోరు ఇంకా కొనసాగుతున్నందువల్ల దేశ ప్రయోజనాల దృష్ట్యా కొన్ని రహస్య వివరాలను ఈ దశలో చెప్పలేమన్నారు. ఈ సమావేశంలో పార్టీలకతీతంగా నేతలంతా ప్రభుత్వానికి మద్దతు ప్రకటించి పూర్తి సంఘీభావం చాటారు. సైనికదళాల సేవలపై ప్రశంసలు కురిపించారు. ఉగ్రదాడి తర్వాత ఇది రెండో అఖిలపక్ష భేటీ. కేంద్రం తరఫున రాజ్‌నాథ్‌తోపాటు మంత్రులు అమిత్ షా, ఎస్.జైశంకర్, జె.పి.నడ్డా, నిర్మలా సీతారామన్ పాల్గొన్నారు. విపక్ష నేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, సందీప్ బందోపాధ్యాయ్, టి.ఆర్.బాలు తదితరులు హాజరయ్యారు. ప్రధాని మోదీ సందేశాన్ని రాజ్‌నాథ్ వినిపించారు.

సమావేశం అనంతరం కేంద్రమంత్రి కిరణ్ రిజిజు మీడియాతో మాట్లాడారు. ఆపరేషన్ కొనసాగుతున్న దృష్ట్యా సాంకేతిక అంశాలను రక్షణమంత్రి వెల్లడించలేకపోయారని చెప్పారు. ప్రతిపక్షాలు అత్యంత పరిణతితో వ్యవహరించాయని కొనియాడారు. ఈ అంశంలో రాజకీయాలకు తావు లేదన్నారు. ఆపరేషన్ సిందూర్‌పై ఐక్యంగా నిలిచి ప్రభుత్వానికి అండగా ఉన్నామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తెలిపారు. కొన్నింటిపై చర్చ పెట్టకూడదని, దేశం కోసం కేంద్రం తీసుకునే చర్యలకు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నామని చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌పై మంచి సందేశాన్ని పంపడానికి పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని రాహుల్ సూచించారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వెల్లడించారు. ప్రధాని ఈ సమావేశానికి హాజరుకాకపోవడంపై మాత్రం అసంతృప్తి వ్యక్తంచేశారు. సంక్షోభ సమయంలో అందరూ ప్రభుత్వానికి అండగా ఉన్నామన్నారు. లష్కరే తయ్యిబా అనుబంధ సంస్థ 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్'పై అంతర్జాతీయస్థాయిలో ప్రచారంచేసి, ఉగ్రసంస్థగా భద్రతామండలి ద్వారా ముద్ర వేయించాలని చెప్పినట్లు ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్‌తోపాటు ఎంఐఎం, తృణమూల్, డీఎంకే, బిజద, ఎన్సీపీఎస్పీ, సీపీఎం, శివసేన యూబీటీ, ఎల్జేపీ (ఆర్‌వీ), జేడీయూ తదితర పార్టీల నేతలు పాల్గొన్నారు.

**గట్టిగానే బదులిస్తాం: జైశంకర్**

పాకిస్థాన్‌తో సంబంధాల్లో పరిస్థితిని మరింత దిగజార్చే ఉద్దేశం భారత్‌కు లేదని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్ స్పష్టంచేశారు. తమ గడ్డపై సైనిక దాడులు జరిగితే స్పందన గట్టిగా ఉంటుందని చెప్పారు. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత్ పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న వేళ ఇరాన్ మంత్రి దిల్లీకి వచ్చారు. 'మాపై సైనిక దాడులు జరిగితే దానికి చాలా గట్టి స్పందన ఉంటుందనడంలో సందేహం లేదు. పాక్‌కు పొరుగుదేశంగా, సన్నిహిత భాగస్వామిగా పరిస్థితిని ఇరాన్ బాగా అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. అనాగరిక దాడి కారణంగానే మేం సరిహద్దు ఆవలి ఉగ్ర శిబిరాలపై దాడులు చేయాల్సి వచ్చింది. నిర్దిష్ట లక్ష్యంతో ఆచితూచి దీనిని పూర్తిచేశాం' అని వివరించారు. 20వ భారత్‌ఇరాన్ సంయుక్త కమిషన్ సమావేశానికి వారిద్దరూ అధ్యక్షత వహించారు. ఇరాన్ మంత్రి వచ్చిన కాసేపటికే సౌదీ విదేశాంగ శాఖ ఉప మంత్రి అబ్దెల్ అల్ జుబైర్ ఆకస్మికంగా దిల్లీకి చేరుకున్నారు. తమ దేశం తరఫున తెచ్చిన సందేశాన్ని జైశంకర్‌కు చేరవేశారు. ఉగ్రపోరుపై భారత్ దృక్కోణాలను సౌదీకి తెలిపినట్లు జైశంకర్ వెల్లడించారు. ఐరోపా సమాఖ్య విదేశీ వ్యవహారాలుభద్రత వ్యవహారాల ఉన్నతస్థాయి ప్రతినిధి కల్లాస్, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీతోనూ జైశంకర్ మాట్లాడారు.

**దేశ వ్యతిరేక ప్రచారాన్ని ఉపేక్షించొద్దు..**

సామాజిక మాధ్యమాల్లో దేశ వ్యతిరేక ప్రచారంపై నిఘా ఉంచాలని కేంద్ర హోంశాఖ పలు రాష్ట్రాల ప్రభుత్వాలకు సూచించింది. ఆపరేషన్ 'సిందూర్' పేరుతో పాక్ ఉగ్రస్థావరాలపై భారత సైన్యం మెరుపుదాడులు చేపట్టిన నేపథ్యంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆపరేషన్ 'సిందూర్' గురించి, దేశ భద్రత గురించి దేశం నుంచి లేదా విదేశాల నుంచి భారత్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేస్తే ఆయా సోషల్ మీడియా ఖాతాలను వెంటనే బ్లాక్ చేయాలని పేర్కొంది.

## అందాల పోటీకి ముస్తాబైన భాగ్యనగరి

(మొదటిపేజీ తెరువాయి)

సంప్రదాయాలను చాటిచెప్పేలా కోస్గి, వరంగల్ ప్రాంతాలకు చెందిన 250 మంది కళాకారిణులతో పేరిణి నృత్య తొలి ప్రదర్శన ఉంటుంది. దీంతోపాటు గుస్సాడీ, ఒగ్గుడోలు, కోలాటం వంటి జానపద కళారీతులనూ ప్రదర్శించనున్నారు. ఈ మేరకు గురువారం సాయంత్రం వరకు 109 దేశాల నుంచి మిస్‌వరల్డ్ పోటీదారులు హైదరాబాద్‌కు చేరుకున్నారు. వీరితోపాటు మిస్‌వరల్డ్ నిర్వాహక బృందం, సిబ్బంది కూడా వచ్చారు.

**జయజయహే తెలంగాణతో షురూ**

ప్రారంభ వేడుకల్లో మొదట రాష్ట్ర గీతం 'జయజయహే తెలంగాణ'ను ఆలపిస్తారు. అనంతరం మిస్‌వరల్డ్ పోటీలను ప్రారంభిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటిస్తారు. పోటీదారులను తెలంగాణ కళాకారులు గచ్చిబౌలి స్టేడియంలోకి తీసుకొస్తారు. ఖండాలవారీగా ఒక్కో దేశం వారిని పరిచయం చేస్తారు. మనదేశం తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్న నందిని గుప్తా చివరలో వస్తారు. ఈ మేరకు గురువారం రిహార్సల్స్ ప్రారంభమయ్యాయి. శుక్రవారం కూడా కొనసాగనున్నాయి. ప్రారంభ వేడుక తర్వాత వివిధ దేశాల అందాల భామలంతా రాష్ట్రంలోని చారిత్రక, పర్యాటక ప్రదేశాలకు వెళతారు. ఈ నేపథ్యంలో... శంషాబాద్ విమానాశ్రయం సహా హైదరాబాద్ నగరాన్ని, నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని, వరంగల్‌లోని వెయ్యి స్తంభాల ఆలయాన్ని, రామప్పగుడిని, చేనేత కేంద్రం చౌటుప్పల్‌ను ముస్తాబు చేస్తున్నారు. దిల్లీ, ముంబయి, చెన్నై తదితర ఎయిర్‌పోర్టుల్లోనూ ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పోటీల్లో మనదేశం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న నందిని గుప్తాతోపాటు అథెన్నా క్రాస్బీ (అమెరికా), ఎమ్మా మోరిసన్ (కెనడా), వాలేరియా కాన్యావో (వెనిజువెలా) వంటి వారు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. పోటీదారుల్లో విద్యార్థులు, వైద్యులు, న్యాయవాదులు, సామాజికవేత్తలు, కళాకారిణులు, ఉద్యమకారిణులు ఉండటం గమనార్హం.

**పోటీలపై యుద్ధం నీడలు**

భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో మిస్ వరల్డ్ పోటీల నిర్వాహక సంస్థ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర ఒత్తిడికి గురవుతున్నాయి.



## అంబర్ పేట లో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన ఉత్సవాలు

అంబర్ పేట మే 8(సమయం న్యూస్): అంబర్ పేట్ డివిజన్ నరేంద్ర నగర్ లో శ్రీ విశ్వ బ్రాహ్మణ సమైక్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీశ్రీశ్రీ మద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి వారి 332వ ఆరాధన మహోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అంబర్ పెట్ కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ . ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కూడా భక్తిశ్రద్ధలతో ఎంతో వైభవోపేతంగా పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆరాధన మహోత్సవ కార్యక్రమాలు, అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంస్థ సభ్యులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంగం వ్యవస్థాపక అధ్యక్షులు జైన్ కుమార్ చారి,బ్రహ్మజీ లక్ష్మణ చారి,కొక్కొండ స్వామి చారి, గణేష్ చారి,అధ్యక్షులు సింగోజి నరేంద్ర చారి, ఉపాధ్యక్షులు శ్రీకాంత్ చారి,ప్రధాన కార్యదర్శి నరేందర్ చారి,కోశాధికారి అశోక్ చారి, పెంటం చారి,సంతోష్ చారి, తదితరులు పాల్గొన్నారు.




## స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇంకుడు గుంతల ఏర్పాటు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 8 (సమయం న్యూస్): అవకాశం ఉన్న ప్రతి బ్యాంక్ బ్రాంచ్ లోనూ ఇంకుడు గుంత ఏర్పాటు చేయాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ సత్యనారాయణ అన్నారు. గురువారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇంకుడు గుంతల ఏర్పాటు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూగర్భ జలాల పరిరక్షణకు ఈ ఇంకుడు గుంతలు ఎంతగానో ఉపయోగపడతాయని నీటి వనరుల సంరక్షణ భావితరాలకు శ్రీరామ రక్ష అని అన్నారు. ఎస్.బి.ఐ. రుద్రాంపూర్ బ్రాంచ్ లో ఇంకుడు గుంత తవ్వే కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ ఈశ్వర్ రావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ రామిరెడ్డి, హెచ్.ఆర్. మేనేజర్ రాములు, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## జలమండలి అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్ పేట మే 8(సమయం న్యూస్) : అంబర్ పేట ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో కాలేరు వెంకటేష్ కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్ తో కలిసి జలమండలి అధికారులు తొ ఎమ్మెల్యే ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నియోజవర్గంలో జరగాల్సిన అభివృద్ధి పనులపై వివరాలు తెలుసుకొని పెండింగ్ లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా జలమండలి అధికారులు ఏపీ జనరల్ మేనేజర్ విష్ణువర్ధన్ గారు, మేనేజర్ రోహిత్ గారు, భావన గారు , మాజీద్ గారు, ప్రవీణ్ గారు తదితరులు పాల్గొన్నారు.

## లైసెన్స్ సర్వేయర్ల శిక్షణ కొరకు దరఖాస్తుల స్వీకరణ

* **జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 08 సమయం న్యూస్: సెటిల్మెంట్, భూరికార్డుల కమీషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ సర్వే ఆదేశాల ప్రకారం లైసెన్స్ సర్వేయర్ల శిక్షణకు అర్హత గల వారి నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు మీసేవ కేంద్రాల ద్వారా ఈ నెల 17వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని, శిక్షణకు ఎంపికైన అభ్యర్థులకు జిల్లా ప్రధాన కేంద్రంలో 50 రోజుల శిక్షణ ఉంటుందని తెలిపారు. ఇంటర్మీడియట్లో గణితంలో 60 శాతం మార్కులు సాధించినవారు, ఐటిఐ, డ్రాఫ్ట్స్ మెన్ (సివిల్), డిప్లొమా (సివిల్), బిటెక్ (సివిల్) సమాన అర్హత గల అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఓసి అభ్యర్థులు 10 వేల రూపాయలు, బిసి అభ్యర్థులు 5 వేల రూపాయలు, ఎస్సి, ఎస్టి అభ్యర్థులు 2 వేల 500 రూపాయలు చెల్లించవలసి ఉంటుందని, వివరాలకు 9676993237, 9848163493 నంబర్లలో సంప్రదించవచ్చని, ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

* **గుడికందుల రైతు వేదిక లో అవగాహన సదస్సు**

తొగుట. మే 8 (సమయం న్యూస్) : తోగుట మండలం, గుడికందుల గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుండి వ్యవసాయ పరిశోధన స్థానం, తోర్నాల మరియు సిద్దిపేట జిల్లా వ్యవసాయ శాఖ సాహకారం తో రైతులకి మెరుగైన సాగు పద్ధతులపై అవగాహన కార్యక్రమం తో పాటు వానాకాలం సాగుకు రైతులను సమాయత్తం చేసే ముఖ్య ఉద్దేశంతో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డా. ఎస్. శ్రీదేవి, ప్రధాన శాస్త్రవేత్త, మాట్లాడుతూ రైతు సోదరులకు సిఫారసు మేరకు యూరియా వాడకం, రసాయనాలను అవసరాన్ని బట్టి వినియోగం నేల సంరక్షణ, ఖరీఫ్ లో రైతులు ఉపయోగించే విత్తనాలు కొన్నప్పుడు రసీదును భద్రపరచుకోవడం, వివిధ పంటల్లో సాగునీటిని ఆదా, ప్రత్యామ్నాయ పంటల



సాగు, చెట్ల పెంపకం లాంటి అంశాలపై అవగాహన కల్పించారు. తర్వాత ఈ కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిథి భవాని రెడ్డి, రాష్ట్ర రైతు కమిషన్ సభ్యులు మాట్లాడుతూ రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని సాగు వ్యయం తగ్గించుకుని మంచి అధిక దిగుబడులు సాధించాలని, నాణ్యమైన విత్తనాలను అధీకృత సంస్థల కొనుగోలు చేసి, రసీదులు భద్రపరచుకోవాలని సూచించారు, రానున్న రోజుల్లో కొత్త విత్తన చట్టం అమలులోకి వస్తుందని పేర్కొన్నారు. అలాగే మహిళా రైతులకు విలువ ఆధారిత ఉత్పత్తులు మరియు డీ హైడ్రేటెడ్ ఉత్పత్తుల ద్వారా మంచి ఆదాయం అవకాశాలు ఉన్నాయని అలాంటి రైతులకు రైతు కమిషన్ తరపున అండగా ఉంటామని తెలిపారు. తరువాత తొగుట మండల వ్యవసాయ అధికారి శ్రీ S. మోహన్ మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువుల వాడకం, నేల సంరక్షణ మరియు వరికి బదులుగా వేరే పంటల సాగు ఉపయోగాల వివరించారు. అనంతరం తొగుట రైతు ఉత్పత్తిదారుల సంఘం C.E.O తిరుపతి మాట్లాడుతూ, రైతు ఉత్పత్తిదారుల సంఘం యొక్క పనితీరు మరియు రైతులకు కలిగే ఉపయోగాలు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డా. A. రమాదేవి మరియు డా.E. ఉమా రాణి, వ్యవసాయ విస్తరణ అధికారులు దేవేందర్, సాయికుమార్., గుడికందుల గ్రామ కార్యదర్శి శ్రీమతి రజినీ, ఇతర ప్రజా ప్రతినిధులు, వెలుగు గ్రామ ఐక్య సంఘం సభ్యులు మరియు 84 మంది రైతులు పాల్గొన్నారు .

## ఇంటర్మీడియట్ పరీక్ష రాసిన ప్రతి విద్యార్థి యు డిఐఎస్ఈ ప్లస్ పోర్టల్ నందు నమోదు అవ్వాల్సిందే

* **యు డిఐఎస్ఈ ప్లస్ పోర్టల్ నందు నమోదు అవ్వాల్సిందే**
* **జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 8(సమయం న్యూస్): ఇంటర్మీడియట్ పరీక్ష రాసిన ప్రతి విద్యార్థి యు డిఐఎస్ఈ ప్లస్ పోర్టల్ నందు కచ్చితంగా నమోదు కావాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. గురువారం ఐ డి ఓ సి కార్యాలయం సమావేశం మందిరం నందు జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతంలో బాలికల కంటే బాలురు వెనుకబడి ఉండటానికి గల కారణాలను జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వరరావు అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు.



అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ లో కూడా డిజిటల్ ఎడ్యుకేషన్ ఫేషియల్ అటెండెన్స్ ప్రవేశ పెట్టేలా చూడాలన్నారు. ఇంటర్మీడియట్ కళాశాలలో అతిపెద్ద మైదానాలు ఉన్నప్పటికీ ఇంకుడు గుంతల నిర్మాణం జరగడం లేదని వెంటనే అన్ని కళాశాలల్లో ఎకరాకి ఐదు ఇంకుడు గుంతలు నిర్మించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇంటర్మీడియట్ కళాశాలలో పరీక్షకు హాజరైన సంఖ్యకు యు డిఐ ఎస్ఈ ప్లస్ నందు నమోదుకు చాలా తేడాలు ఉన్నాయని అట్టి కళాశాల ప్రిన్సిపాల్ లను పిలిపించి జిల్లా విద్యాశాఖ ప్లానింగ్ కోఆర్డినేటర్ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో అందరూ ఇక్కడే విద్యార్థులందరినీ యుడైస్ ప్లస్ పోర్టల్ లో నమోదు చేసేలా చూడాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వరరావు జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర చారి కోఆర్డినేటర్లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరికి చదువు ముఖ్యం

* **జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 08 సమయం న్యూస్: ప్రతి ఒక్కరికి చదువు చాలా ముఖ్యమని, పూర్తి విజ్ఞానాన్ని సంపాదించుకుని జీవితంలో ఉన్నత స్థాయిలో నిలిచేందుకు విద్య దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. జిల్లాలోని కాసీపేట మండలం వెంకటాపూర్ గ్రామంలో జిల్లా వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అక్షరాస్యత కార్యక్రమానికి జిల్లా వయోజన విద్యాశాఖ అధికారి పురుషోత్తం నాయక్, కాసీపేట మండల తహశీల్దార్ భోజన్న లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, జిల్లా వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాత్రి తరగతులతో నిరక్షరాస్యులైన వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం జరుగుతుందని తెలిపారు. మనిషికి మాత్రమే చదవగలిగే, రాయగలిగే,



తెలుసుకునే జ్ఞానం ఉంటుందన్నారు. కాసీపేట మండలంలో ప్రారంభించిన ఈ కార్యక్రమం మరిన్ని ప్రాంతాలలో చేసేందుకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. విద్యతో పాటు వృత్తి శిక్షణలో నైపుణ్యత పొందాలని సూచించారు. మండలంలోని గ్రామపంచాయతీలకు 2 కుట్టు మిషన్ల చొప్పున అందించడం జరిగిందన్నారు. కుటీర పరిశ్రమలను ప్రోత్సహిస్తూ, అవకాశం కల్పించడం జరుగుతుందని తెలిపారు. అటవీ భూములు, పోడు భూములలో వెదురు సాగుకు అవకాశం ఉంటుందన్నారు. మండలంలోని విద్యార్థులకు వేసవిలో వేసవి క్రీడా శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని, దాదాపు జిల్లాలోని 50 పాఠశాలలలో వేసవి శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందన్నారు. జీవితంలో మార్పు రావాలంటే చదువుకోవాలని, మార్పుతో పాటు సమాజంలో గౌరవం లభిస్తుందని తెలిపారు. చదవడానికి రాత్రి తరగతులలో వయోజనులు విద్యపై చూపిస్తున్న శ్రద్ధ అభినందనీయమని, మరింత మందికి ఆదర్శంగా నిలవాలని అన్నారు. మండలాన్ని 100 శాతం అక్షరాస్యత మండలంలో తీర్చిదిద్దేందుకు అందరం సమిష్టిగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సప్తర్అలీ, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడం కోసమే రాజీవ్ యువవికాసం

* **జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 08 సమయం న్యూస్: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా అర్హులకు రుణ సదుపాయం కల్పించడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ తెలిపారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని జిల్లా అదనపు కలెక్టర్ చాంబర్ లో రెవెన్యూ ప్రత్యేక ఉప పాలనాధికారి డి చంద్రకళ, షెడ్యూల్ కులాల కార్పొరేషన్ ఈడి చాతరాజుల దుర్గాప్రసాద్, షెడ్యూల్ కులముల అభివృద్ధి అధికారి పోటు రవీందర్ రెడ్డి, జిల్లా అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమశాఖ అధికారి నీరటి రాజేశ్వరి, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎ పురుషోత్తం, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి జనార్ధన్ లతో కలిసి రాజీవ్ యువ వికాసం అక్షరాస్యత (నిల్ప్), ఎస్ఎస్సి ఫలితాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకంలో అర్హులైన నిరుద్యోగ అభ్యర్థులకు ఆర్థిక రుణ సదుపాయం కల్పించి ఉపాధి పొందే విధంగా ప్రోత్సహించడం జరుగుతుందని, ఈ క్రమంలో దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. అక్షరాస్యత కార్యక్రమంలో జిల్లాలోని కాసిపేట మండలాన్ని ఎంపిక చేసుకొని 100 శాతం అక్షరాస్యత మండలంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని, ఇదే స్ఫూర్తితో మంచిర్యాలను అక్షరాస్యత



జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఇటీవల విడుదలైన ఎస్ఎస్సి వార్షిక పరీక్షా ఫలితాలలో జిల్లా విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని, మున్ముందు మరింత ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లాను రాష్ట్రంలో ముందంజలో ఉంచే విధంగా అధికారులు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ను కలిసిన భాష్యం పాఠశాల పదవ తరగతి విద్యార్థులు

అంబర్ పేట, మే,8 (సమయం న్యూస్) : అంబర్ పేట, ప్రేమ్ నగర్ లోనీ భాష్యం పాఠశాల విద్యార్థులు మరోసారి అద్భుతమైన ఫలితాలు సాధించారు. గత వారం విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో పాఠశాల విద్యార్థులందరూ 100% ఉత్తీర్ణత సాధించారు. యం. శృతి అనే విద్యార్థిని 600 కు గానూ అత్యధికంగా 572 పాఠశాల టాపర్ గా నిలిచింది. ప్రిన్సిపల్ శోభా రెడ్డి తో కలిసి ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పాఠశాల టాపర్ నిలిచిన ఎం. శృతి విద్యార్థినీకి పదివేల రూపాయలు పాఠశాల యాజమాన్యం తరపున బహుమతి అందజేశారు.

## సాక్షి ఎడిటర్ ధనుంజయ్ రెడ్డిపై దాడి సహించరానిది

* **విద్యార్థి సంఘం నేత కోటా శివశంకర్**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 8 (సమయం న్యూస్): సాక్షి ఎడిటర్ ధనుంజయ రెడ్డిపై పోలీసుల దౌర్జన్యాల తీరును దాడి చేయడాన్ని తెలంగాణ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని తెలంగాణ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట శివశంకర్ గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కావాలని సాక్షి పత్రిక ఎడిటర్ ధనుంజయ రెడ్డిపై తప్పుడు కేసులు నమోదు చేయడం దారుణమని మండిపడ్డారు. నిర్భయంగా నీతి నిజాయితీగా వార్తలు రాస్తే కావాలని కేసులు నమోదు చేయడం ఇదంతా పత్రిక స్వేచ్ఛను భావ ప్రకటన స్వేచ్ఛను భంగం కలిగించడమేనని పేర్కొన్నారు. సీనియర్ జర్నలిస్టులు సాక్షి ఎడిటర్ ధనుంజయ రెడ్డిపై పెట్టిన తప్పుడు కేసుని ఎత్తివేయాలని అదేవిధంగా అన్యాయంగా అక్రమంగా ధనుంజయ రెడ్డి ఇంటిపై పోలీసులు చొరబడడం దాడి చేయడం అక్రమంగా ఇంట్లోకి చొరబడడం ఇలాంటివన్నీ పత్రిక స్వేచ్ఛకు భంగం కలిగించడమేనని ఈ చర్యలను తెలంగాణ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని అన్నారు. ఇలాంటి సంఘటనలు తెలుగుదేశం ప్రభుత్వం చంద్రబాబు నాయుడు పోలీసులు మానుకోవాలని లేకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని తెలంగాణ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం హెచ్చరిస్తుందని కోట శివశంకర్ పేర్కొన్నారు.




## బోధన్ పోలీస్ స్టేషన్ లో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల రికవరీ

* **యజమానులకు అప్పగింపు**

బోధన్ పట్టణం, మే 8, సమయం న్యూస్ : నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ సందర్భాల్లో ప్రజలు పోగొట్టుకున్న మొత్తం 11 మొబైల్ ఫోన్లను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్ సాయంతో పోలీసులు రికవరీ చేశారు. తిరిగి స్వాధీనం చేసుకున్న ఈ మొబైల్ ఫోన్లను గురువారం రోజున బోధన్ పోలీస్ స్టేషన్ లో ఎస్.హెచ్.ఓ వెంకట నారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం ద్వారా యజమానులకు తమ సిబ్బంది ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు సీఈఐఆర్ పోర్టల్ యొక్క ఉపయోగాలపై అవగాహన కల్పించారు. మొబైల్ పోగొట్టుకున్న వెంటనే సిఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్.హెచ్.ఓ వెంకట్ నారాయణ ఎస్సైలు హబీబ్ ఖాన్, భాస్కరాచారి, కళ్యాణి పోలీసుల సిబ్బంది బాధితులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐ వెంకట్ నారాయణ మాట్లాడుతూ మొబైల్ ట్రాకింగ్, రికవరీలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రజల నమ్మకాన్ని పొందడమే లక్ష్యమని పోలీసులు తెలిపారు.

# టాస్క్ ద్వారా నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ

* **జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 08 సమయం న్యూస్: తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ డిపార్ట్మెంట్ (టాస్క్) ద్వారా ఉపాధి సామర్థ్యాన్ని పెంచే నైపుణ్య శిక్షణ అందించడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో టాస్క్ శిక్షణ కేంద్రం ద్వారా శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి టాస్క్ అధికారి సాయి కుమార్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, 30 రోజుల పాటు అర్హత గల యువతకు పరిశ్రమ సంబంధిత నైపుణ్యాలను అందించి వారి ఉపాధి అవకాశాలను పెంపొందించడం జరుగుతుందని తెలిపారు. శిక్షణ మొదటి విడతలో ఎంపికైన 40 మంది నిరుద్యోగ యువతకు శిక్షణలో భాగంగా సిసీ ప్లస్ ప్లస్, జావా, పైథాన్, ఆప్టిట్యూడ్ రీజనింగ్ (ఎఅండ్ఆర్), ఇంటర్వ్యూ నైపుణ్యాలలో శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. శిక్షణ కార్యక్రమం అనంతరం నైపుణ్యత గల అభ్యర్థులకు ఉపాధి అవకాశానికి సహాయం అందించబడుతుందని తెలిపారు. అభ్యర్థులు శిక్షణలో పొందిన అనుభవంతో అందివచ్చిన ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శిక్షకుడు శ్రీనివాస్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ భూనీల సమేత వరదరాజ స్వామి పునఃప్రతిష్ట

* **అధిక సంఖ్యలో దర్శించుకున్న భక్తులు**



గజ్వేల్, మే 8: సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం వరదరాజ్ పూర్ గ్రామంలో అతి పురాతన, పునర్నిర్మాణమైన వరదరాజ స్వామి ఆలయంలో శ్రీ భూనీల సమేత వరదరాజ స్వామి దేవతామూర్తుల పున ప్రతిష్ట గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రతిష్ట ఉత్సవాల్లో భాగంగా గురువారం కుంభారాధనములు, వేద విన్నపములు, మూలమంత్ర హోమములు, ప్రాయశ్చిత్త హోమములు, ద్వారాతోరణ బలి, మహా పూర్ణాహుతి, కుంభయాత్ర, శాంతి కళ్యాణం నిర్వహించారు. భక్తులకు శ్రీ భూనీల సమేత వరదరాజ స్వామి ప్రత్యేక అలంకరణలో దర్శనం ఇచ్చారు. స్వామివారి సేవలో భక్తులు జై శ్రీమన్నారాయణ అంటూ నినాదాలతో ఒకసారిగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ గోపాలకృష్ణ, ఆలయ పురోహితులు వరదాచార్యులు, శ్రీనివాసా చార్యులు, వేణుగోపాలా చార్యులు, పురుషోత్తమచార్యులు, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కర్ణాకర్ రెడ్డి, మాజీ మండల కోఆప్షన్ సభ్యులు లక్కాకుల సాహెరా నరేష్, మాజీ గ్రామ సర్పంచ్ bప్రవీణ్ కుమార్, మాజీ ఎంపిటిసి ధనలక్ష్మి కృష్ణ, కృష్ణ, నాయకులు సాయిని మహేష్, సుధాకర్ రెడ్డి, అతని నర్సింలు, శ్రీశైలం, రాజు, కనకయ్య, వివిధ శాఖల అధ్యక్షులు, గ్రామస్తులు, పెద్ద ఎత్తున భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ సింధూర్‌కు మద్దతుగా బోధన్ కాంగ్రెస్ భారీ ర్యాలీ

: **ఉగ్రవాదానికి భారత్ చెక్**



బోధన్ పట్టణం, మే 8 సమయం న్యూస్ : పహల్గాం (కాశ్మీర్) లో జరిగిన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తూ, భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ కు మద్దతుగా నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించబడింది. పిఓకే - పాకిస్థాన్ ఆక్రమిత ప్రాంతంలో గల 9 కీలక ఉగ్రవాద సంస్థలను అణచివేయడంలో భారత సైన్యం విజయవంతం కావడంతో, దేశ వ్యాప్తంగా మద్దతు వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ పిలుపుమేరకు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లో సంఘీభావం ప్రకటించగా, బోధన్ పట్టణంలో గురువారం భారత సైన్యానికి సంఘీభావంగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు పాషా మొహీనుద్దీన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా నుండి కొత్త బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పిసిసి డెలిగేట్ గంగా శంకర్, పట్టణ అధ్యక్షులు పాషా మోహినుద్దీన్, ఇతర నేతలు మాట్లాడుతూ, "ఉగ్రవాదాన్ని కూలదోసే ఆపరేషన్ సింధూర్‌ను దేశ ప్రజలంతా బలపరచాలి. భారత త్రివిధ దళాలు పూర్తి సిద్ధంగా ఉన్నాయి. ప్రజలు సైన్యం వెనుక నిలవాలి. ఇది భారతదేశ భద్రతకు ముఖ్యమైన యుద్ధం," అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా భారత సైన్యానికి, కేంద్రలో గల నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని అభినందించారు. ప్రపంచ దేశాల మద్దతు కూడా భారత్ వైపు ఉన్నదని వారు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగేశ్వరరావు, హరికాంత్ చారి, తూము శరత్ రెడ్డి, అంకుదామోదర్ రెడ్డి, కలీం, దబ్బు, తెల్లారి నవీన్, చిత్రాల ప్రమోద్, భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బోధన్ సబ్ కలెక్టర్ సర్ ఆకస్మిక తనిఖీలు

* **చెక్ పోస్టులలో కఠిన ఆదేశాలు**



బోధన్ డివిజన్, పోతంగల్ మండలం, మే 8, సమయం న్యూస్ : బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో పలు చెక్ పోస్టలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా, పోతంగల్ చెక్ పోస్ట్ ను సందర్శించిన ఆయన, మహారాష్ట్ర నుండి వచ్చే వరి వాహనాలను ఎట్టి పరిస్థితుల్లోనూ రాష్ట్రంలోకి అనుమతించకూడదని, సరిహద్దు భద్రతా సిబ్బందిని కఠినంగా ఆదేశించారు. వారి ఆదేశాల మేరకు, చెక్ పోస్ట్ వద్ద విధుల్లో ఉన్న అధికారులు ప్రతి వాహనాన్ని నిర్దిష్టంగా తనిఖీ చేసి, అక్రమ రవాణా చేసే ప్రయత్నాలను అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వరి ధాన్యం అక్రమ రవాణా రాష్ట్రానికి నష్టాన్ని కలిగిస్తుందని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. అంతేగాక, సబ్ కలెక్టర్ కోడిచెర్ల చెక్ పోస్ట్ ను కూడా తనిఖీ చేశారు. అక్కడ అక్రమంగా రవాణా అయ్యే ఇసుక వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించారు. "ఇలాంటి వాహనాలు ఎట్టి పరిస్థితుల్లోనూ దాటడానికి అనుమతించకూడదు. ఏ వాహనమైనా అనుమతి లేకుండా ప్రయాణిస్తే, వెంటనే స్వాధీనం చేసి, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి" అని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలలో రెవెన్యూ, పోలీసు అధికారులు పాల్గొని చర్యలు చేపట్టారు. ప్రజా ఆస్తి పరిరక్షణకు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు.

## సమ్మర్ కోచింగ్ క్యాంపు లను పరిశీలించిన అడిషనల్ కమీషనర్ యాదగిరి రావు






హైదరాబాద్, మే 08 ( సమయం న్యూస్) : క్రీడల అదనపు కమిషనర్ డాక్టర్ ఎన్. యాదగిరిరావు వివిధ ప్లే గ్రౌండ్‌లు మరియు స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లలోని సమ్మర్ కోచింగ్ క్యాంప్ 2025 ప్రదేశాలను సంబంధిత జోన్ గేమ్స్ ఇన్‌స్పెక్టర్లతో కలిసి గురువారం పరిశీలించారు సమ్మర్ కోచింగ్ క్యాంప్ ద్వారా ఏర్పాటు చేసిన సౌకర్యాలను ఉపయోగించుకోవడానికి పిల్లలను ప్రోత్సహించాలని దిశానిర్దేశం చేయాలని పార్ట్ టైమ్ మరియు గౌరవ కోచ్‌లను ఆదేశించారు. పిల్లల కోసం ఈ అద్భుతమైన అవకాశాన్ని ఉపయోగించుకోవాలని మరియు GHMC యొక్క ఈ గొప్ప చొరవలో విస్తృతంగా సహకరించాలని స్పోర్ట్స్ అదనపు కమిషనర్ తల్లిదండ్రులు కోరారు. 12 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్నవారిలో బంగారు పతకాలు సాధించడం ద్వారా తమకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్న విధి మరియు త్రిషల విజయాన్ని కమిషనర్ ప్రశంసించారు.

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక



# ప్రభుత్వ పాఠశాలలో ఒక నెల లోపల టాయిలెట్స్ నిర్మించాలి

* **జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు.**



సంగారెడ్డి మే08(సమయం న్యూస్): జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో తప్పనిసరి టాయిలెట్స్ నిర్మించాలనీ జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అధికారులను ఆదేశించారు. పంచాయతీ రాజ్ ,జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ,మిషన్ భగీరథ, విద్య, వైద్య ఆరోగ్య, మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారులతో కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అధికారులతో గురువారం జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలలో టాయిలెట్స్ నిర్మాణం చేపట్టాలన్నారు. టాయిలెట్స్ లేని పాఠశాలల్లో తప్పనిసరిగా నిర్మించాలన్నారు. టాయిలెట్స్ నిర్మాణాలు ఒక నెలలో పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులు 40 మంది అబ్బాయిలకు ఒక టాయిలెట్ ,30 అమ్మాయిలకు ఒకటి టాయిలెట్ లెక్కన విద్యార్థుల సంఖ్య ప్రకారం నిర్మించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో వంట గది, ప్రహరీ గోడ నిర్మాణం చేయాలన్నారు. గ్రామాల్లో సీసి రోడ్స్ పూర్తి చేయాలి,గురుకుల పాఠశాల,కళాశాలలో వాటర్ ట్యాంక్ ను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. గురుకుల విద్యా సంస్థలకు , అంగన్వాడి కేంద్రాలకు మిషన్ భగీరథ నీరు తప్పనిసరిగా సరఫరా చేయాలన్నారు. త్రాగునీటి సమస్య లేకుండా చూడాలని,మౌలిక వసతులు సదుపాయాలు కల్పించాలన్నారు. వివిధ పెండింగ్ పనులు పూర్తి చేయడానికి అధికారులు పాఠశాలకు వచ్చినపుడు స్థానిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అందుబాటులో ఉండాలన్నారు. గ్రామ పంచాయతీ భవనాలు లేని గ్రామాలలో గ్రామ పంచాయతీలు భవనాలు నిర్మించాలన్నారు. గ్రామాల్లో అంగన్వాడి కేంద్రాల భవనాలు నిర్మించాలన్నారు. అంగన్వాడి అధికారులు అంగన్వాడి కేంద్రాలను సందర్శించి తనికి చేయాలన్నారు. సి డి పి ఓ,లు సూపర్ వైజర్ల తో సమీక్ష నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో లో అదనపు కలెక్టర్ చంద్ర శేఖర్, జడ్పీ సీఈవో జానకి రెడ్డి పంచాయతీ అధికారి సాయి బాబా, పిడి డిఆర్డిఏ జ్యోతి వైద్య అధికారినీ గాయత్రి దేవి ,ఏ ఈ,డి, ఈ లు సంబంధిత శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## బోధన్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆహార భద్రత అధికారుల తనిఖీలు

బోధన్ పట్టణం, మే 8 సమయం న్యూస్ : నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో జిల్లా నుండి ఆహార భద్రత అధికారులు, ఎంటమాలజీ డాక్టర్ వెంకట్ నేతృత్వంలో గురువారం రోజున ఆసుపత్రి వంటశాలను, రోగులకు అందుతున్న ఆహారం మీద క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వంటగదిలో ప్రతిరోజు వంటకు ఉపయోగించే నిలువ ఆహార సరుకులను, వస్తువులను పరిశీలించి, ఆహార నాణ్యతను, భద్రతా ప్రమాణాలను సమీక్షించారు. రోగులకు అందిస్తున్న ఆహారంలో శుభ్రత, పోషక విలువల పై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ తనిఖీలు రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వహించామని డా. వెంకట్ పేర్కొన్నారు. ఆయనతో పాటు ఫార్మసీ ఆఫీసర్ నారాయణ, సూపర్వైజర్ జల్లా రవి కుమార్, సోమేశ్వర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ తనిఖీలు ఆసుపత్రిలో ఆహార నాణ్యత మెరుగుపరచడమే లక్ష్యంగా జరిగాయని అధికారులు తెలిపారు.

# కేంద్ర ప్రభుత్వ పథకాలు జిల్లాలో ప్రజలకు చేరువ చేయాలి

* మెదక్ ఎం పి రఘునందన రావు




మెదక్ మే 08( సమయం న్యూస్) : ఆర్గానిక్. ఫామింగ్, వ్యవసాయ పనిముట్లపై రైతులు మొగ్గు చూపాలి జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ (దిష) సమావేశంలో మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు సూచన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు జిల్లాలో ప్రజలకు చేరువ చేయాలని మెదక్ పార్లమెంటు సభ్యులు మాధవనేని రఘునందన్ రావు అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ (దిశ) జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అధ్యక్షతన కలెక్టరేట్ లో నిర్వహించడం జరిగింది. ఈ దిశ సమావేశానికి పార్లమెంటు సభ్యులు మాధవ నేని రఘునందన్ రావు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఇంచార్జ్ అదనపు కలెక్టర్ భుజంగరావు, డిఆర్డిఓ పిడి శ్రీనివాసరావు, ఎఫ్పి ఎం డైరెక్టర్ సురేష్ బాబు తో కలిసి ఎంపీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యా, వైద్యం, వ్యవసాయం పరిశ్రమలు, పౌరసరఫరాల, ప్లానింగ్, సంక్షేమ, ఇరిగేషన్, గ్రౌండ్ వాటర్, ఆర్ అండ్ బి, నేషనల్ హైవే ,గ్రామీణ అభివృద్ధి, శాఖల అభివృద్ధి కార్యక్రమాల లక్ష్యాలు క్షేత్రస్థాయిలో తీసుకుంటున్న చర్యలపై సుదీర్ఘంగా ఎం.పీ సమీక్షించారు. ముందుగా గత దిశ సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలపై అధికారులను ప్రశ్నలు సమాధానాలు రూపంలో అడిగి తెలుసుకున్నారు . ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు మాధవ నేని రఘునందన్ రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలు జిల్లాలో ప్రజలకు అందజేయడంలో అధికారులు చిత్తశుద్ధి తో వ్యవహరించాలని ప్రతి పథకానికి సంబంధించి విస్తృత ప్రచారం కల్పించి ప్రజలలో అవగాహన పెంపొందించి పథకాలు అందేలా చూడాలన్నారు. విద్యాశాఖ ద్వారా ప్రభుత్వ బాలికల పాఠశాలలో మరుగుదొడ్లు నిర్మాణం చేపట్టి , ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు, ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రత్యేక క్లినిక్ చేయడానికి క్లీనింగ్ యంత్రాన్ని ప్రయోగాత్మకంగా మన జిల్లాకు మంజూరు చేస్తామని ఎంపీ హామీ ఇచ్చారు. మన ఊరు మనబడి కార్యక్రమం కింద చేపట్టి పూర్తిచేసిన పనులకు గాను కాంట్రాక్టర్లకు నిధులు మంజూరు కాలేదని ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎంపీ దృష్టికి తీసుకురాగా ఉన్నతాధికారులతో సంప్రదించి సమస్య పరిష్కార దిశగా పనిచేస్తామని హామీ ఇచ్చారు. ఎంపీ నిధుల నుండి మండలాల్లో ప్రతి మండలానికి 02 అంగన్వాడి సెంటర్స్ మంజూరు చేయడం జరిగిందని వివరాలు గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్య ఆరోగ్యశాఖ ద్వారా సబ్ సెంటర్స్ 20 లక్షల వ్యయంతో నిర్మించి తలపెట్టిన టెండర్ దశలో ఉన్న వాటికి 20 లక్షల వ్యయం సరిపోవటం లేదని అదనపు నిధుల కోసం కేంద్ర ప్రభుత్వం ద్వారా చర్యలు తీసుకుంటామన్నారు. మెదక్ మెడికల్ కాలేజీ కి ఫ్యాకల్టీ.. ఇన్ఫ్రాస్ట్రక్చర్, లప్రో స్కోపీ కావాలని ఈ సమావేశంలో మెడికల్ సూపరింటెంట్ ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. నర్సాపూర్ గుమ్మడిదల 4 లైన్ల రోడ్ 2025.26 లో శాంక్షన్ అవుతుందని తెలిపారు. వ్యవసాయ మార్కెటింగ్ కమిటీలు జిల్లాలో పత్తి కొనుగోలు, సన్నవర్ కొనుగోలు మార్కెటింగ్, సంబంధిత విషయాలు, వడ్ల కొనుగోలు నిర్వహణ రైతుల ఎకౌంట్లో 48 గంటల్లో డబ్బులు జమ విషయాలు వ్యవసాయ, మార్కెటింగ్ అధికారుల ద్వారా ఆరా తీశారు. జిల్లా వ్యవసాయ శాఖ ద్వారా ఆర్గానిక్ ఫామింగ్, వ్యవసాయ పనిముట్లు పై రైతులు మొగ్గు చూపేలా అవగాహన సదస్సుల ద్వారా విస్తృత ప్రచార కల్పించాలని ఎంపీ ఆదేశించారు. మార్కెటింగ్ కమిటీలు, నాబార్డ్ గోదాము వివరాలపై సుదీర్ఘ వివరణ ఇవ్వాలని అన్నారు. జిల్లా పౌరసరఫరాల శాఖ ద్వారా రేషన్ కార్డుల వివరాలు రేషన్ కార్డు లబ్ధిదారులకు పారదర్శకంగా సన్న బియ్యం సరఫరా, రైస్ మిల్లులో తనిఖీ వివరాలు పిడిఎస్ బియ్యం అమ్ముకున్న విషయంలో కేసు నమోదు మిల్లులను సీజ్ చేయడం సంబంధిత విషయాలను సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానమంత్రి సిరీస్ పథకం అమలు మంజూరైన నిధులు ,లైబ్రరీ, పిల్లలకు విజ్ఞాన విహారయాత్రలు వెచ్చించిన అంశాలను వాటిపై చర్చించారు. జిల్లా పరిశ్రమల శాఖ ద్వారా పీఎం విశ్వకర్మ పథకం సమర్థవంతంగా అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. నేషనల్ హైవే ద్వారా చేపట్టిన మెదక్ సిద్దిపేట రోడ్డు, స్టేజ్ వన్ ఫారెస్ట్ క్లియరెన్స్ విషయంలో నేషనల్ హైవే, ఫారెస్ట్ అధికారుల సమన్వయంతో ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గుమ్మడిదలహ నర్సాపూర్ మెదక్ నేషనల్ హైవే 765 డి సంబంధిత వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా సంక్షేమ శాఖ ద్వారా చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను జిల్లాలో అంగన్వాడి సెంటర్స్ ద్వారా చిన్న పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నామని బాల్య వివాహాలను నిర్మూలించడానికి జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల ప్రకారం క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటున్నామన్నారు సుకన్య సమృద్ధి యోజన పథకం 40 నందిని ఎన్రోల్మెంట్ చేయడం జరిగిందని, ఐసిడిఎస్ టీచర్ల ద్వారా పదవ తరగతిలో పాసైన విద్యార్థినీ విద్యార్థులను ఇంటర్మీడియట్లో జాయిన్ అయ్యేవిధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు సంక్షేమ శాఖ అధికారి హైమావతి ఎంపీ గారికి వివరించగా అంగన్వాడీలను సమర్థవంతంగా నిర్వహిస్తూ బలోపేతం చేసే దిశగా ముందుకు పోవాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి ద్వారా ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజనతో మోడల్ సోలార్ గ్రామాన్ని గుర్తించే ప్రక్రియ వేగవంతం చేయాలనిజిల్లా స్థాయి కమిటీ చర్చించి తద్వారా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. 5,000 మంది పాపులేషన్ ఉన్న గ్రామపంచాయతీని గుర్తించి, ఆ గ్రామంలో ప్రతి ఇంటికి సోలార్ పవర్ ఏర్పాటు చేయడంతో పాటు, వీధిలైట్లు కూడా సోలార్ తో వెలిగే విధంగా చూడటం ఈ పథకం ముఖ్య ఉద్దేశం అని జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య వివరించగా ప్రధానమంత్రి సూర్య ఘర్: ముఫ్త్ బిజిలి యోజన అనేది భారతదేశంలోని గృహాలకు ఉచిత విద్యుత్తును అందించడం లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వ పథకం . ఈ పథకాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫిబ్రవరి 15, 2024న ప్రారంభించారు. ఈ పథకం కింద, గృహాలకు వారి పైకప్పులపై సౌర ఫలకాలను ఏర్పాటు చేసుకోవడానికి సబ్సిడీని అందిస్తారని సమర్థ నిర్వహణకు తగ సూచనలు చేశారు. విద్యుత్ శాఖ ద్వారా ఇంటిగ్రేటెడ్ పవర్ డెవలప్మెంట్ పథకం అమలు తీరును అడిగి తెలుసుకున్నారు . జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ దిశ సమావేశంలో చర్చించిన అంశాలపై అధికారులతో సమావేశాలు నిర్వహించుకుని కేంద్ర అభివృద్ధి పథకాల కార్యక్రమాల పురోగతిపై చర్యలు తీసుకుంటామన్నారు. 10 వ తరగతి లో మంచి రిజల్ట్ వచ్చిందని,బాల్యవివాహాలను, డ్రాప్ అవుట్లను అరికట్టేందుకు పదవ తరగతి పాస్ అయిన పిల్లలను ఇంటర్మీడియట్లో జాయిన్ అయ్యేవిధంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు



## వధూవరులను ఆశీర్వదించిన చింతకింది మంజూరు..

రాయపోల్, మే 8.ఏ : ఉమ్మడి మండల సహకార సంఘం సొసైటీ సీఈవో పరికిబండ మల్లేశం కుమార్తె అక్షిత దుర్గాప్రసాద్ దంపతుల వివాహం గురువారం జరగగా. ఈ పెళ్లికి ఉమ్మడి మండల బిఆర్ఎస్ సీనియర్ నాయకులు. రాయపోల్ గ్రామానికి చెందిన నికి చెందిన చెందిన చింత కింది. మంజూరు. గురువారం పెళ్లికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో రజక సంఘం మండల అధ్యక్షులు వడ్లకొండ బిక్షపతి. నాయకులు రాజయ్య. జాల రాజయ్య. రాములు. వీరేశం వీరేశం. వివిధ పార్టీల చెందిన నాయకులు కార్యకర్తలు తదితలు ఉన్నారు.



## 93వ రోజు చేరిన నిరసనలు

గుమ్మడిదల,మే 8,సమయం న్యూస్ : సంగారెడ్డి జిల్లా,గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి, ప్యారా నగర్ లో ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డ్ కు నిరసనగా గురువారం నాటికి నిరసన కార్యక్రమాలు 93వ రోజుకు చేరుకున్నాయి. నల్లవల్లి, కొత్తపల్లి ,ప్యారా నగర్, గుమ్మడిదల గ్రామాల ప్రజలు నిరంతరాయంగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు ఏ గ్రామంలో ప్రజలు ఆయా గ్రామాల శిబిరాలలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. గ్రామాలలో ఆడ మగ తేడా లేకుండా సమయస్ఫూర్తితో నిరసన కార్యక్రమాలు చేస్తున్న, అధికారుల నుండి గాని, ప్రభుత్వం నుండి గాని ఎలాంటి స్పందన లేదని వారు వాపోయారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించకుంటే నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఇకనైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి వెంటనే డంప్ యార్డు పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, మహిళలు, రైతు సంఘాల నాయకులు, మండల జెఎసి నాయకులు,ప్రజలు పాల్గొన్నారు.

# టీబీ రోగులుపోషకాహారం ఔషదాలు తప్పనిసరిగా తీసుకోవాలి..

* **టీబీ రోగులుపోషకాహారం**
* **ఔషదాలు తప్పనిసరిగా తీసుకోవాలి..**
* **జిల్లా కలెక్టర్ తేజాస్ నంద్ లాల్ పవర్**




సూర్యాపేట మే08 (సమయం న్యూస్) : సూర్యాపేట జిల్లాను టీ బీ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ తేజాస్ నంద్ లాల్ పవర్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరం నందు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ద్వారా ఏర్పాటుచేసిన బ్రోస్ ఫౌండేషన్, ఆప్టిమస్ ఫార్మాషూటికల్ సెగ్మెంట్ ఫార్మసిటికల్ లోక్ భారతి ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూషన్ ద్వారా టి బీ కిట్స్ పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోషకాహారం లోపం వలన టీవీ వస్తుంది కాబట్టి వైద్య సిబ్బంది టీవీ రోగులను గుర్తించి బలమైన ఆహారం, వైద్యం, న్యూట్రిషన్ కిట్లను ఉచితంగా అందించాలని టీవీ రోగుల కొరకు ప్రధానమంత్రి టీబి ముక్తా భారత్ అభియాన్ పీఎం టీబీ ఎంబీఏ పథకం కేంద్ర ప్రభుత్వం ప్రారంభించడం జరిగినది. టీబితో ఇబ్బంది పడేవారు. తప్పనిసరిగా ఆరు నెలల పాటు టాబ్లెట్స్ వాడాలని మధ్యలో టాబ్లెట్స్ వాడకపోతే జబ్బు తగ్గదని సూచించారు. నిక్షయ శివిర్ ద్వారా టిబి రోగులకి అవగాహన టిబి రోగులకి సహాయం చేసేందుకు ఫార్మా కంపెనీలు ఇండస్ట్రీ వారు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి వారికి సహాయం చేసేందుకు నిక్షేత్రగా ఉండాలని తెలిపారు.. ఈ సందర్భంగా బ్రోస్ ఫౌండేషన్ ద్వారా 4684 కిట్స్, ఆప్టిమస్ ఫార్మాసిటికల్స్ సెగ్మెంట్ లోక్ భారతి ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ ద్వారా 1429 కిడ్స్ టీబీ పేషెంట్లకు అందించడం జరిగింది ఈ కిట్ నందు ఒక కేజీ కందిపప్పు, అర కేజీ ఆయిల్, కేజీ పల్లీలు, మూడు కేజీల బియ్యం ఒక్కో టిబి పేషెంట్ కి అందించడం జరిగింది. పోషకాలతో కూడిన ఆహారం మందులు తప్పనిసరిగా ఉపయోగించాలని జిల్లా కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కోటాచలం, డిప్యూటీ డిఎంహెచ్వో జయ మనోహరి, టిబి ప్రోగ్రాం అధికారినీ డా. నాజియా, డా. వెంకట పాపిరెడ్డి పలమరాలజిస్ట్, డాక్టర్ శ్రీశైలం, డిపిఓ ఉమా, సిబ్బంది ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# లైసెన్స్ సర్వేయర్ శిక్షణ కొరకు 17 వరకు దరఖాస్తు చేసుకోవాలి

* **జిల్లా కలెక్టర్ విజయేందర బోయి**



మహబూబ్ నగర్ మే08( సమయం న్యూస్) : భూ భారతి చట్టం 2025 అమలులో భాగంగా రెవెన్యూ యంత్రాంగం,సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖ కు సహాయకారిగా ఉండేందుకు ఆసక్తి గల లైసెన్స్డ సర్వేయర్ లు మీ సేవ ద్వారా మే 17 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ విజయేందిర బోయి ఒక ప్రకటన లో తెలిపారు. పౌరుల భూ సంబంధిత సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూ భారతి (భూమి హక్కుల రికార్డు) చట్టం, 2025ను అమలులోకి తీసుకు వచ్చినట్లు ఆమె తెలిపారు. రెవెన్యూ యంత్రాంగం, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ డిపార్ట్మెంట్ కు సహాయ పడేందుకు రాష్ట్రంలో దాదాపు 5000 మంది లైసెన్స్ పొందిన సర్వేయర్లకు శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం యోచిస్తోందని తెలిపారు. ఈ లైసెన్స్డ్ సర్వేయర్లకు శిక్షణ ఇచ్చి జిల్లాల్లో నియమించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ లైసెన్స్డ్ సర్వేయర్లకు సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖ ద్వారా మే 26 నుండి జులై 26 వరకు శిక్షణ (50 పని దినాలు) నివ్వనున్నట్లు ఈ ప్రకటన లో తెలిపారు.



# బాక్స్ డ్రైన్ నిర్మాణానికి శంకుస్థాపన

* **గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి.**

హన్మకొండ మే 08(సమయం న్యూస్) : బల్దియా పరిధి 30 వ డివిజన్ జూ పార్క్ లో ఉన్న డ్రైన్ నుండి ఔట్ లెట్ వరకు రూ.100 లక్షల బల్దియా సాధారణ నిధులతో నిర్మించతలపెట్టిన బాక్స్ డ్రైన్ నిర్మాణ పనులకు జూ పార్క్ యందు గురువారం స్థానిక వరంగల్ (పశ్చిమ) శాసన సభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి తో కలిసి శంఖుస్థాపన చేసిన నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రావుల కోమల కిషన్ మామిండ్ల రాజు ఎఫ్ ఆర్ ఓ మయూరి రెడ్డి డి ఈ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

# సరస్వతి పుష్కరాల సమర్థవంతంగా నిర్వహణ కు డ్యూటీ రోస్టర్ తయారు

* **జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



జయశంకర్ భూపాల్ పల్లి మే08( సమయం న్యూస్) : సరస్వతి పుష్కరాల విధులు నిర్వహణకు డ్యూటీ రోస్టర్ తయారు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. గురువారం సరస్వతి పుష్కరాల విధులు, పనులు పర్యవేక్షణపై రెవెన్యూ, పంచాయతి రాజ్, అన్ని శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడిఓలు, ఎంపి ఓలతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ పుష్కరాలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి వస్తున్నారని అన్నారు. తహసీల్దార్లు, ప్రోటోకాల్ విధులు, ఎంపీడీఓలు పారిశుధ్య విధులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఘాట్ వద్ద రెండు రోజుల్లో మొత్తం పారిశుధ్య పనులు పూర్తి చేసి పరిశుభ్రం చేయాలని సూచించారు. పారిశుధ్య కార్యక్రమాలు పర్యవేక్షణ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పర్యవేక్షణ చేయాలని అన్నారు. పుష్కర విధులు కేటాయించిన అధికారులు శుక్రవారం నుండి క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని తెలిపారు. సమయం చాలా తక్కువ ఉందని పనులు, ఏర్పాట్లు. ముమ్మరం చేయాలని స్పష్టం చేశారు. సరస్వతి. మాతా విగ్రహం ప్రారంభోత్సవం, భక్తులు గోదావరిలోకి వెళ్లకుండా ప్రమాద హెచ్చరికల బోర్డ్స్, ఉచిత అన్నదానం ఇలా ప్రతి అంశాన్ని పర్యవేక్షణ చేసేందుకు నియమించిన అధికారులు శుక్రవారం నుండి పటిష్ట పర్యవేక్షణ చేయాలని, వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఆర్డిఓ రవి, అన్ని శాఖల జిల్లా అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడివోలు, ఎంపీవోలు తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ కలిసిన కలిసిన సుడా చైర్మన్ కొరికాన రవికుమార్

పాలకొండ నియోజకవర్గం, వీరఘట్టం మరియు పాలకొండలో సుడా పరిధిలో గల పలు అభివృద్ధి కార్యక్రమాల కోసం నియోజకవర్గ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ను కలిసిన శ్రీకాకుళం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ కొరికాన రవికుమార్. వీరఘట్టంలో సెంట్రల్ లైటింగ్, పాలకొండ వెంకట రాయణి కోనేరు సుందరీ కరణ, అభివృద్ధి చేయుటకు పరిశీలించారు.

# బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు తప్పవు

* **వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్**

హన్మకొండ మే 08( సమయం న్యూస్) : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎవరైన ప్రజలు ఇబ్బందులకు గురిచేస్తూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే వారిపై కఠిన చర్యలు వుంటాయని వరంగల్ పోలీస్ కమిషనర్ మందుబాబులను హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాలతో పాటు, మద్యం దుకాణాల ముందు మద్యం సేవిస్తూ అ ప్రాంతం నుండి వచ్చిపోయే ప్రజలతో పాటు చిన్నపిల్లలు మరింత ఇబ్బందులకు గురౌవున్నట్లుగా పోలీసులకు పలు ఫిర్యాదులు రావడంలో దీనిపై స్పందించిన వరంగల్ పోలీస్ కమిషనర్ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే మందుబాబులపై చర్యలు చేపట్టేందుకు సిద్దమయ్యారు. ఇందుకోసం వరంగల్ పోలీస్ కమిషనర్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పగలు,రాత్రి సమయాల్లో మద్యం దుకాణం పరిసరాలతో పాటు నిర్మానుష్య ప్రదేశాల్లో ముమ్మరంగా పెట్రో లింగ్ నిర్వహించడంతో పాటు నిర్మాణంలో వున్న భవనాలు, మనుషులు నివాసం లేని పురాతన భవనాల్లో తనిఖీలు నిర్వహించాల్సిందిగా వరంగల్ పోలీస్ కమిషనర్ అదేశాలు జారీ చేయడంతో నిన్నటి రోజు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూన్న నిన్న ఒక్కరోజే మొత్తం 221 మంది




మందుబాబులపై సిటి పోలీస్ యాక్ట్ క్రింద కేసులు నమోదు చేయడం జరిగింది. ఇందులో అత్యధికంగా *జనగామ డివిజనల్ పరిధిలో 57 కేసులు నమోదు కాగా, హన్మకొండ డివిజన్ పరిధిలో 42 కేసులు,ఘన్‌పూర్40, కాజీపేట 24, వర్ధన్నపేట 24, నర్సంపేట 24, వరంగల్ 10 చొప్పున కేసులు నమోదు చేయడం చేయడం జరిగిందని. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ పట్టుబడిన మందుబాబులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని. అలాగే మద్యం దుకాణాల పరిసరాల్లో ఎవరు కూడా బహిరంగంగా మద్యం సేవించకుండా మద్యం దుకాణా యజమానులు తగురీతిలో చర్యలు తీసుకోవాలని లేకుంటే మద్యం దుకాణాలపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని. ఇకపై ఎవరైన బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే డయల్ 100 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని పోలీస్ కమిషనర్ ప్రజలకు సూచించారు.

# రెవెన్యూ సదస్సుల లో వచ్చిన విన్నపాలు పరిష్కరించాలి

* **జిల్లా కలెక్టి రాహుల్ శర్మ**

జయశంకర్ భూపాస్ పల్లి మే08( సమయం న్యూస్) : జిల్లా లో ఎంపిక చేసిన పైలెట్ గ్రామాల రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యల పై వచ్చిన దరఖాస్తుల తప్పని సరిగా పరిష్కార చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. జిల్లా కలెక్టర్ శ్రీ రాహుల్ శర్మ గురువారం రేగొండ మండలంలోని దమన్నపేట రైతు వేదిక మరియు తిరుమలగిరి గ్రామంలోని జిల్లా, మండల పరిషత్ పాఠశాలలో జరుగుతున్న రెవెన్యూ సదస్సులను ఏర్పాట్లను జరుగుతున్న తీరును పరిశీలించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ భారతి నూతన ఆర్ఓఆర్ రెవెన్యూ చట్టంపై పైలట్ ప్రాజెక్టు కింద రేగొండ మండలాన్ని



ఎంపిక చేసి రైతుల నుండి సలహాలు, సూచనలు, భూ సంబంధత సమస్యల దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని 11 గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించాల్సి ఉండగా ఇప్పటి వరకు 8 గ్రామాల్లో సదస్సులు పూర్తి అయినట్లు తెలిపారు. హెల్ప్ డెస్క్ ను పరిశీలించి రైతులకు సలహాలు సూచనలు ఇవ్వాలని సూచించారు. ప్రజల దరఖాస్తులను పరిశీలించిన కలెక్టర్, రైతులు భూ సంబంధిత సమస్యలపై ఇచ్చిన దరఖాస్తులను తప్పనిసరిగా రిజిస్టర్‌లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. దరఖాస్తు స్వీకరించిన సమయంలోనే సంబంధిత రిమార్క్స్ కూడా నమోదు చేయాలని విచారణకు సులువుగా ఉంటుందని సూచించారు. దరఖాస్తుల విచారణ ప్రక్రియను వేగవంతం చేసి, ప్రజలకు త్వరితగతిన న్యాయం చేకూర్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్ శర్మ స్పష్టం చేశారు. సదస్సుల్లో వచ్చిన దరఖాస్తు లు ఆధారంగా నోటీసులు జారీ చేయాలని పేర్కొన్నారు. దరఖాస్తు ఎందుకు పరిష్కారం కాలేదో అర్జీ దారునికి లిఖిత పూర్వకంగా తెలియ జేయాలి లేదా సంభందిత ధ్రువ పత్రాలు తీసుకుని రావాలని లిఖిత పూర్వకంగా తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఆర్డిఓ రవి, తహసీల్దార్లు శ్వేతా, సత్యనారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతంలో త్రాగునీటి సమస్య తలెత్త కుండ పటిష్ట చర్యలు తీసుకోవాలి

* **జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

ఆదిలాబాద్ మే08 (సమయం న్యూస్) : వచ్చే నెలన్నర పాటు గ్రామాల్లో త్రాగునీటి సరఫరాలో సమస్య తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా RWS అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో త్రాగునీరు సరఫరాపై మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ , పంచాయతీ విస్తరణ అధికారులు, సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే నెలన్నర పాటు వేసవి కాలం నేపథ్యంలో ప్రజలకు త్రాగునీరు సరఫరాలో ఆటంకం కలగకుండా చూసుకోవాలని, అవసరం ఉన్న చోట స్థానిక వాటర్ సోర్సెస్లను వాటర్ ట్యాంకర్లను వినియోగించు కోవాలన్నారు. మిషన్ భగీరథ, మున్సిపల్, పంచాయితీరాజ్ శాఖ అధికారులు సమ




న్వయంతో పనిచేయాలని, పైప్ లైన్లు డ్యామేజ్ కాకుండా చర్యలు తీసుకోవాలని, నీరువృధా కాకుండా చూసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జీపీ ల వారీగా ఎక్కడెక్కడ విద్యుత్ అసౌకర్యం, భగీరథ నీటి సమస్యలు ఉన్నాయో అడిగి తెలుసుకొని సమస్య ఉన్న చోట నీటి సరఫరా ట్యాంకర్ల తో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, పైప్ లైన్ డ్యామేజ్ అయితే వెంటనే మరమత్తులు చేపట్టాలని, సీసీ రోడ్లు వలన పైప్ లైన్లు డ్యామేజ్ అయినా వాటికి సంబంధించి తగు చర్యలు చేపట్టాలని సూచించారు. ఇంట్రా, గ్రిడ్, పంచాయితీ ,rws అధికారులను వారి వారి ప్రోగ్రెస్ ను కలెక్టర్ కు తెలిపారు. అందరి కో ఆర్డినేషన్ తో గ్రామాల్లో నీటి సరఫరా లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆన్నారు. వాటర్, ఓవర్ హెడ్ ట్యాంకర్లు ద్వారా క్లోరినేషన్ చేసి నీరు సరఫరా చేయాలన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో మిషన్ భగీరథ నీరు ఓపెన్ వెల్స్ నల్లా ద్వారా వచ్చే నీరు వృధా కాకుండా వాటర్ మెన్ ల ద్వారా నిరంత పర్యవేక్షణ చేయాలన్నారు. మున్సిపల్ పరిధిలో లాండా సాంగ్వి దగ్గర గల ఇంటెక్వెల్ పంప్ హౌస్ నీటి సప్లై కోసం 40 లక్షలు పరిపాలన అనుమతులు మంజూరుతో పాటు పనులు పూర్తి చేసి 11.5 MLD నీరందించడం జరుగుతుంది. గతంలో ఎప్పుడు లేని విధంగా ఎక్కువ మొత్తంలో నీటి సరఫరా చేయడం రుగుతుందన్నారు. 170 సర్వే ఫ్లాట్ ల వద్ద విద్యుత్ సరఫరా లేని దృష్ట్యా స్టాటిక్ ట్యాంక్ ల ద్వారా నీటిని సరఫరా చేయాలనీ అన్నారు. లీకేజ్ లు ఏమైనా ఉంటె యుద్ధ ప్రాతిపదికన పూర్తీ చేసి నిరంతరం నీటి సరఫరా జరగాలన్నారు. చేతి పంపులకు సంబందించిన విడి భాగాల టెండర్ లను పూర్తీ చేసి ఏరోజుకారోజు మరమ్మత్తులు పూర్తీ చేయాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో SE SE RWS శ్రవణ్, డిపిఓ శ్రీలత, dlpo ఫణీంద్ర,, మున్సిపల్ సిబ్బంది, డిఈ , AE ఎంపీఓలు , తదితరులు పాల్గొన్నారు.

# జల్ హి అమృత్ శిక్షణకు హాజరైన బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే

* **మెట్రో వాటర్ సప్లై& సీవరేజ్ బోర్డ్ నిర్వహిస్తున్న మురుగునీటి శుద్ధీకరణ పద్ధతుల పరిశీలన....**

గ్రేటర్ వరంగల్ , 08 మే (సమయం న్యూస్) : సెంటర్ ఫర్ ఎన్విరాన్మెంట్ అర్బన్ గవర్నెన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్, ఆస్కీ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్లో రాష్ట్రంలోని పది మున్సిపల్ కమిషనర్లతో (జల్ హి అమృత్ అటల్ మిషన్ ఫర్ రిజువనేన్స్ అండ్ అర్బన్ ఇన్ ట్రాన్స్ఫర్మేషన్) 2.0 క్రింద నిర్వహించిన ఒకరోజు శిక్షణ శిబిరం, కార్యశాలలో జి డబ్ల్యు ఎం సి కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే పాల్గొన్నారు. జల్ హి అమృత్ 2.0 లక్ష్యం, మురుగునీటిని శుద్ధి చేసి పునర్వినియోగించడం ద్వారా నీటి నిర్వహణను మెరుగుపరచడం, శుద్ధి కర్మాగారాల నిర్వహణకు సమర్థవంతంగా చేయించడం తదితర అంశాలపై శిక్షణ ఇవ్వడం జరిగింది. అనంతరం హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్ నిర్వహిస్తున్న మురుగునీటి శుద్ధీకరణ పద్ధతులను క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరిగింది. వ్యర్థజల పునర్వినియోగ వనరుల కేంద్రం (డబ్ల్యూ ఆర్ ఆర్ సి)ను ఏర్పాటు చేయడానికి మరియు పట్టణ వ్యర్థజల శుద్ధి ప్లాంట్లను (యు డబ్ల్యూ టి పి ఎస్) బలోపేతం చేయడానికి అవసరమైన



నైపుణ్యాలపై అవగాహన కలిగించారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సివరేజ్ బోర్డ్ యొక్క శుద్ధి చేసిన నీటి పునర్వినియోగం, బయోసాలిడ్ నిర్వహణలోని కొన్ని ఉత్తమ పద్ధతులను బృందానికి క్షేత్రస్థాయి లో పరిచయం చేశారు.అలాగే అమృత్ 2.0 లక్ష్యాలు, ప్రోత్సాహక నిధులను సమర్థవంతంగా వినియోగించేందుకు అవసరమైన ప్రతిపాదనలు తయారు చేయడం మరియు సమీక్షించడం పై వర్క్ షాప్ లో అవగాహన కలిగించారు.




## పలు శుభకార్యాలలో పాల్గొన్నపాలకొండ నియోజకవర్గ శాసనసభ్యులు నిమ్మక జయక్రిష్ణ

చెబోదుల లక్ష్మీనారాయణ(సర్పంచ్) గారి ఆహ్వానం మేరకు పాలకొండ మండలం పరశురామపురం గ్రామంలో జరిగిన నీరజ వెడ్స్ సాయిబాబా వివాహ వేడుకల్లో పాల్గొని నవ వధూవరులను ఆశీర్వదించిన గౌరవ పాలకొండ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ నిమ్మక జయక్రిష్ణ . పాలకొండ మండలం NK రాజపురం గ్రామంలో జరిగిన సిమ్మానాయుడు వెడ్స్ అశ్విని వివాహ వేడుకలో పాల్గొని నవ వధూవరులను ఆశీర్వదించిన గౌరవ పాలకొండ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ నిమ్మక జయక్రిష్ణ. వీరఘట్టం మండలం తలవరం గ్రామానికి చెందిన శ్రీ తమరాపు జయప్రసాద్ శ్రీమతి ద్రాక్షాయణి దంపతుల ఆహ్వానం మేరకు తేజస్విని వెడ్స్ పవన్ వివాహ వేడుకలో పాల్గొని నవ వధూవరులను ఆశీర్వదించిన గౌరవ పాలకొండ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ నిమ్మక జయక్రిష్ణ.

# ట్యాన్‌ని తగ్గించే కలబంద!




**సౌందర్య సంరక్షణకు మార్కెట్లో ఎన్ని ప్రత్యామ్నాయాలున్నా ఇంట్లో సహజసిద్ధంగా లభించే ఉత్పత్తులు/పదార్థాలే మంచివి. కలబంద కూడా అందులో ఒకటి. జిడ్డుగా, పొడిగా, సున్నితంగా.. ఇలా అన్ని రకాల చర్మతత్వాల వారికీ ఇది మేలు చేస్తుందంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో కలబంద చర్మానికి ఎలా ప్రయోజనకరమో తెలుసుకుందాం రండి..**

**ముఖం మెరిసేలా..**

* చిటికెడు పసుపు, ఒక చెంచా పాలు, కొంచెం రోజ్‌వాటర్, చెంచా తేనె.. వీటన్నింటినీ బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమానికి కలబంద గుజ్జును కూడా జతచేసి మరోసారి కలుపుకోవాలి. దీన్ని ముఖానికి, మెడకు పట్టించి ఇరవై నిమిషాలు ఉంచుకోవాలి. తర్వాత శుభ్రంగా కడిగేసుకుంటే ముఖం కాంతివంతమవుతుంది.

**జిడ్డుగా ఉందా?**

* జిడ్డు చర్మతత్వం ఉన్న వారిని మొటిమల సమస్య వేధిస్తుంది. ఇలాంటి వారు కలబంద ఆకుని నీళ్లలో కాసేపు మరిగించి



దాన్ని పేస్ట్‌లాగా చేసుకోవాలి. దానికి కొన్ని చుక్కల తేనె కలుపుకొని ముఖానికి రాసుకోవాలి. పదిహేను నిమిషాల తర్వాత చల్లటి నీటితో కడిగేసుకోవాలి. ఇలా వారానికోసారి చేస్తుంటే మంచి ఫలితం ఉంటుంది.

**ఆ మచ్చలు మాయం!**

* గాయాల వల్ల చర్మంపై ఏర్పడిన మచ్చలను పోగొట్టడంలోనూ కలబంద గుజ్జు ఉపయోగపడుతుంది. ఇందుకోసం కలబంద గుజ్జులో కాస్త రోజ్‌వాటర్ వేసి బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని మచ్చలపై అప్లై చేసి ఇరవై నిమిషాల పాటు అలాగే ఉంచుకోవాలి. ఆ తర్వాత చల్లటి నీటితో శుభ్రంగా కడిగేసుకుంటే మంచి ఫలితం ఉంటుంది.

**పొడి చర్మమైతే..**



* పొడి చర్మతత్వం ఉన్న వారి చర్మం నిర్జీవంగా కనిపిస్తుంటుంది. ఇందుకు కారణం చర్మంలో ఉండే తేమ శాతం తగ్గిపోవడమే! మరి తేమ శాతాన్ని పెంచుకోవాలంటే కొద్దిగా కలబంద గుజ్జులో కాస్త ఆలివ్ ఆయిల్‌ని వేసి మెత్తటి పేస్ట్‌లాగా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు రాసుకోవాలి. ఇరవై నిమిషాల తర్వాత చల్లటి నీటితో శుభ్రంగా కడిగేసుకుంటే ఫలితం ఉంటుంది.

**ట్యాన్‌కు విరుగుడు!**

* చర్మంపై ఎండ పడి ట్యాన్ రావడం సర్వసాధారణం. ఈ క్రమంలో కాస్త కలబంద గుజ్జు తీసుకొని అందులో టీస్పూన్ చొప్పున నిమ్మరసం, పసుపు వేసి బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని సమస్య ఉండే ప్రదేశంలో రాసుకోవాలి. పదినిమిషాల తర్వాత కడిగేసుకోవాలి. దీనివల్ల కేవలం ట్యాన్ మాత్రమే కాదు.. మొటిమలు కూడా తగ్గిపోతాయి.



# రంగు మార్చే రియో!

**ఆకుపచ్చ-ఊదారంగు ఆకులతో కనువిందు చేసే ఈ మొక్క ఇంటి ముంగిటే కాదు... ఆఫీసులో పెంచుకోవడానికీ అనువైనది. తక్కువ సంరక్షణతో సులువుగా పెంచుకోగలిగే దీని గురించి తెలుసుకుందామా!**

ఎండ పెరిగినా, నీళ్లు తక్కువైనా, తీవ్రంగా చలి పెడుతున్నా కూడా ఓ పట్టాన వాడిపోని మొక్క రియో. ఒక్క మాటలో చెప్పాలంటే... తక్కువ నిర్వహణతో పెరిగే అందమైన అలంకరణ మొక్క ఇది. రియో శాస్త్రీయనామం ట్రాడెస్కాంటియా స్పాథేసియా. దీన్నే మోసెస్ ఇన్ ది క్రెడిల్, బోట్ లిల్లీ, ఆయిస్టర్ ప్లాంట్ అని కూడా పిలుస్తారు. ఆకులే దీనికి ప్రత్యేక ఆకర్షణ. ఊదారంగులో కాంతిమంతంగా మెరిసిపోతుందీ మొక్క. ఎండ తగ్గినప్పుడు పచ్చగా మారుతుంది. కొమ్మల్ని నాటితే చాలు మొక్కగా పెరిగిపోతుంది. మట్టితోపాటు నీళ్లల్లోనూ పెంచుకోవచ్చు. కుండీల్లో నాటుకుంటే బాల్కనీ, వంటగది కిటికీ, ఆరుబయట తోట... ఇలా ఎక్కడైనా దీన్ని సులువుగా పెట్టేయొచ్చు. సారవంతమైన మట్టిని వాడి, నెలకోసారి ద్రవరూప ఎరువుల్ని అందిస్తే ఆరోగ్యంగా కనిపిస్తాయి. ఇది కాలుష్య కారకాలను నియంత్రించి గాలిని శుద్ధి చేయగలదట. అంతేకాదు, చాలా ప్రాంతాల్లో ఈ మొక్కకు ఔషధ గుణాలు ఉన్నాయని నమ్ముతారు. ముఖ్యంగా చర్మ, జీర్ణ సంబంధిత సమస్యలకు పరిష్కారంగా దీన్ని వాడతారు.





# పంజాబ్ X ఢిల్లీ మ్యాచ్ రద్దు



ధర్మశాల: ఐపీఎల్ 18 సీజన్‌లో భాగంగా ధర్మశాల స్టేడియంలో పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య జరుగుతోన్న మ్యాచ్ అర్ధంతరంగా రద్దయింది. 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో జమ్మూలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. జమ్మూ లక్ష్యంగా పాక్ దాడులకు తెగబడుతోంది. దీంతో భద్రతాపరంగా సమస్యలు తలెత్తకూడదనే ఉద్దేశంతో మ్యాచ్ రద్దు చేస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. స్టేడియంలో ప్రేక్షకులు పూర్తిగా బయటకు వెళ్లే వరకు ఒక స్టాండ్ వైపు మాత్రమే లైట్స్ ఆన్ చేసి ఉంచారు. తొక్కిసలాట జరగకుండా ప్రేక్షకులను సురక్షితంగా బయటకు వెళ్లేలా స్థానిక పోలీసులు, భారత సైనిక బలగాలు జాగ్రత్తలు తీసుకున్నాయి. మ్యాచ్ రద్దు కావడంపై బీసీసీఐ కూడా స్పందించింది. 'ప్రస్తుతం పరిస్థితి నిలకడగా లేదు. భారత్, పాక్ మధ్య ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. అందుకే మేము మ్యాచ్‌ను రద్దు చేశాము. ఆటగాళ్లు, సపోర్టింగ్ స్టాఫ్, ప్రేక్షకుల భద్రత మా మొదటి ప్రాధాన్యత. ఎట్టి పరిస్థితుల్లో దేశ ప్రయోజనాలే మాకు ముఖ్యం. పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నాం. తదనుగుణంగా తదుపరి నిర్ణయాలు తీసుకుంటాం' అని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా తెలిపారు. ఆటగాళ్లు, సహాయక సిబ్బంది, మ్యాచ్ అధికారులను ధర్మశాల నుంచి ఢిల్లీకి తీసుకురావడానికి బీసీసీఐ ప్రత్యేక రైలును ఏర్పాటు చేసినట్లు సమాచారం. సమీప రైల్వే స్టేషన్ ఉనాలో ప్లేయర్లు, సపోర్టింగ్ స్టాఫ్, మ్యాచ్ అధికారులు రెండు బృందాలుగా విడిపోయి అక్కడి నుంచి రైలు ఎక్కే అవకాశం ఉంది. అంతకు ముందు వర్షం కారణంగా మ్యాచ్ ఓ గంట ఆలస్యంగా 8:30కు ప్రారంభమైంది. ఆట రద్దయ్యే సమయానికి 10.1 ఓవర్లకు పంజాబ్ కింగ్స్ ఒక వికెట్ నష్టపోయి 122 పరుగులు చేసింది. ప్రియాంశ్ ఆర్య (70; 34 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్స్‌లు), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (50; 28 బంతుల్లో 7 ఫోర్లు) చెలరేగారు. ప్రియాంశ్ ఆర్య ఔటైన తర్వాత శ్రేయస్ అయ్యర్ క్రీజులోకి వచ్చాడు. తర్వాత మ్యాచ్ రద్దయింది.



## రోహిత్ శర్మ స్థానాన్ని భర్తీ చేయడం కష్టం: కపిల్ దేవ్

టీమ్ఇండియా స్టార్ క్రికెటర్ రోహిత్ శర్మ టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇంగ్లాండ్ పర్యటనకు రోహిత్‌ను సారథిగా తప్పించబోతున్నారని వార్తలు వచ్చిన కొన్ని గంటల్లోనే అతను టెస్టుల నుంచి తప్పుకొంటున్నట్లు ప్రకటన చేయడం గమనార్హం. ఇప్పటికే టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించిన రోహిత్.. ఇక వన్డేల్లో మాత్రమే కొనసాగనున్నాడు. ఈ నేపథ్యంలో రోహిత్‌పై భారత మాజీ కెప్టెన్ కపిల్‌దేవ్ ప్రశంసలు కురిపించాడు. 'రోహిత్ శర్మ ఆటగాడిగా, కెప్టెన్‌గా అద్భుతంగా జట్టును ముందుకు నడిపించాడు. మంచి క్రికెట్ ఆడాడు. అతను కెప్టెన్సీ చేసిన విధానం, ముఖ్యంగా అతను క్రికెట్ ఆడిన తీరు అద్భుతం. భారత క్రికెట్‌లో కొంతమంది మాత్రమే ఇలాంటి క్రికెట్ ఆడారు. సుదీర్ఘ ఫార్మాట్‌లో కెప్టెన్ రోహిత్‌కు ప్రత్యామ్నాయం దొరకడం కష్టం. అద్భుతమైన కెరీర్‌కు వీడ్కోలు పలికిన రోహిత్‌కు అభినందనలు తెలియజేస్తున్నాను' అని కపిల్‌దేవ్ వెల్లడించాడు.

## సినిమా

### మల్లీశ్వరి రీ ఎంట్రీ!



విక్టరీ వెంకటేశ్ సరసన మల్లీశ్వరి సినిమాలో నటించిన బాలీవుడ్ భామ కత్రినా కైఫ్.. ఈ అమ్మడు ఇప్పుడు అంతగా ఫాం లో లేదు కానీ ఒకప్పుడు అమ్మడు బాక్సాఫీస్ ని షేక్ చేసింది. బీ టౌన్ ఆడియన్స్ డ్రీం గర్ల్ గా కత్రినా అదరగొట్టేసింది. 2003 భూమ్ సినిమాతో కెరీర్ మొదలు పెట్టిన ఈ బ్యూటీ ఇప్పటికీ అదే క్రేజ్ కొనసాగిస్తోంది. లాస్ట్ ఇయర్ మెర్రీ క్రిస్మస్ తో అలరించిన కత్రినా కైఫ్ నెక్స్ట్ హౌజ్ ఫుల్ 5 తో రాబోతుంది. పెళ్లైనా ఆమె గ్లామర్ విషయంలో ఏమాత్రం తగ్గట్లేదు. ఈమధ్య బాలీవుడ్ హీరోయిన్స్ అంతా కూడా పాన్ ఇండియా మోజులో పడ్డారు. అందుకే తెలుగులో చేస్తున్న పాన్ ఇండియా సినిమాల వైపు చూస్తున్నారు. ఇప్పటికే బాలీవుడ్ భామలు అలియా భట్, దీపిక పదుకొనె, దిశా పటాని, కియరా అద్వాని, జాన్వి కపూర్ ఇలా అందరు కూడా బాలీవుడ్ నుంచి టాలీవుడ్ షిఫ్ట్ అయ్యారు. ఇక్కడ సినిమా చాన్స్ వస్తే చాలు వాలిపోతున్నారు. కత్రిన తొలి సినిమా భూమ్ తర్వాత చేసిన రెండో సినిమానే మల్లీశ్వరి. ఈ భామ విక్టరీ వెంకటేష్ తో కలిసి మల్లీశ్వరి సినిమా చేసింది. బాలకృష్ణతో అల్లరి పిడుగు లోనూ నటించిందీ బ్యూటీ. తెలుగులో రెండు సినిమాలు చేసి ఆ తర్వాత ఇటు వైపు చూడని కత్రినా ఇన్నాళ్లకు మళ్లీ టాలీవుడ్ మీద ఆసక్తి చూపిస్తోందట. మంచి బజ్ ఉన్న సినిమా.. పాన్ ఇండియా మొత్తం ఊపేసే సినిమా చేయాలని కత్రినా భావిస్తోంది.

### ప్రెగ్నెన్సీ నిజం కాదు!



అక్కినేని నాగచైతన్య, శోభితా దూళిపాళ్ల మూడు ముళ్ల బంధంతో ఒక్కటైన విషయం తెలిసిందే. వీళ్లు గుడ్ న్యూస్ చెప్పారంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం అంతా ఉత్తదేనట. కొత్తగా పెళ్లైయిన జంటలపై ఏడాదిలోపే ఇలాంటి పుకార్లు పుట్టుకొస్తున్నాయి. ఇటీవల అటు మెగా కోడలు లావణ్య త్రిపాఠి ప్రెగ్నెంట్ అనే వార్తలు వచ్చాయి. శోభిత కూడా తల్లి కాబోతోందనేది విషయం సామాజిక మాద్యమాల్లో చక్కర్లు కొట్టింది. వీరిలో లావణ్య త్రిపాఠి నిజంగానే గర్భం దాల్చారు. ఈ విషయాన్ని ఇటీవల వరుణ్ తేజ్‌లావణ్య జంట అధికారికంగా ప్రకటించింది. అయితే శోభిత గురించి వినిపించిన 'గుడ్ న్యూస్' మాత్రం ఒట్టి వదంతి మాత్రమే. శోభిత పర్సనల్ లైఫ్ గురించి వినిపిస్తున్న వార్తల్లో నిజం లేదని ఆమె టీమ్ ప్రకటించింది. ప్రస్తుతం శోభిత తన వైవాహిక జీవితం ఆస్వాదిస్తోందని, మాతృత్వంపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని టీమ్ క్లారిటీ ఇచ్చింది. పెళ్లి తర్వాత శోభిత సినిమాలకు దూరంగా ఉన్నప్పటికీ.. సోషల్ మీడియా ద్వారా మాత్రం ఫ్యాన్స్ ని పలకరిస్తోంది. ఇక నాగచైతన్య పెళ్లి తర్వాత 'తండేల్'తో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ప్రస్తుతం కార్తీక్ దండు దర్శకత్వంలో ఓ మైథాలాజికల్ థ్రిల్లర్ సినిమా చేస్తున్నాడు.

### కరెక్ట్ టైమ్‌కు వస్తావు కదా!



సమంత రుతు ప్రభు నిర్మాణ రంగంలోకి ఎంట్రీ ఇచ్చిన సంగతి విదితమే. తన సొంత బ్యానర్ ట్రాలాలా మూవీస్ పిక్చర్స్ లో నిర్మించిన తొలి సినిమా 'శుభం' రేపు రిలీజ కాబొతుంది. ఈ చిత్రానికి ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం సమంత ఫోకస్ అంతా ఈ సినిమాపైనే పెట్టింది. ఈ సినిమా ప్రమోషన్స్‌ని తన భుజాన వేసుకొని ముందుకు సాగుతోంది. వరుస ఇంటర్వ్యూలు, మీడియా సమావేశాలతో ఫుల్ బిజీ అయిపోయింది. అంతేకాదు ఈ సినిమా ప్రమోషన్స్‌కి తన స్నేహితుల సహాయం కూడా తీసుకుంటోంది సామ్. తాజా వెన్నెల కిశోర్‌తో కలిసి ఓ ఫన్ వీడియో కూడా చేసింది. ఈ వీడియోలో సమంత ' నా శుభం మూవీ ప్రీమియర్స్ కి రావట్లేదా.. కరెక్ట్ టైమ్ కు వస్తావు కదా' అని అడుగుతుంది. వెన్నెల కిశోర్ ఏమోతను నటించిన 'సింగిల్' మూవీ కూడా రేపే రాబోతుందని చెప్పాలనుకుంటాడు. కానీ సమంత అతన్ని మాట్లాడనీయకుండా.. 'నువ్వు, నీ ఫ్యామిలీ తప్పకుండా వస్తారు కదా? నేను నిర్మించిన ఫస్ట్ మూవీ ఇది తప్పకుండా రావాలి' అంటూ గబగబా మాట్లాడేస్తుంది. చివరికి నువ్వు కచ్చితంగా వస్తున్నావు అని కట్ చేసేస్తది. ఈ వీడియోని సమంత తన ఇన్‌స్టాలో షేర్ చేస్తూ.. సింగిల్ ఫోన్ కాల్‌లో వెన్నెల కిశోర్‌కి శుభం చెప్పేశా.. మే 9న థియేటర్లలో రిలీజ్ కాబోతుంది' అని రాసుకొచ్చింది. ఈ వీడియో వైరల్ గా మారింది.

### జాక్ స్ట్రీమింగ్ స్టార్ట్



సిద్ధు జొన్నలగడ్డ హీరోగా, బేబీ బ్యూటీ తెలుగమ్మాయి వైష్ణవి చైతన్య హీరోయిన్ గా బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం జాక్. టిల్లు స్క్వేర్ వంటి బ్లాక్ బస్టర్ చిత్రం తర్వాత సిద్ధు జొన్నలగడ్డ నటించిన స్పై యాక్షన్ కామెడీ సినిమాగా వచ్చిన ఈ సినిమా డిజాస్టర్ గా నిలిచింది. మొదటి ఆట నుండే ఫ్లాప్ టాక్ రావడంతో ఓపెనింగ్స్ కూడా రాబట్టలేకపోయింది. కాగా ఇప్పుడు ఈ సినిమా ఓటీటీ స్ట్రీమింగ్ కు వచ్చింది. రిలీజ్‌కు ముందే ఈ సినిమా డిజిటల్ రైట్స్ ను భారీ ధరకు కొనుగోలు చేసింది నెట్ ఫ్లిక్స్. ఏప్రిల్ 10 న థియేటర్స్ లో వచ్చిన ఈ సినిమాను ఇవాళ్టి నుంచి స్ట్రీమింగ్ కు రెడీ చేసింది నెట్ ఫ్లిక్స్. తెలుగు, తమిళ్, మలయాళం, హింది, కన్నడ భాషాల్లో జాక్ ను స్ట్రీమింగ్ కు తీసుకువచ్చింది.

### పాక్ ఓటీటీ కంటెంట్‌పై భారత ప్రభుత్వం కీలక నిర్ణయం

'ఆపరేషన్ సిందూర్' ఇంకా కొనసాగుతోందని, కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తాజాగా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో పాకిస్థాన్‌ను ముప్పేట దాడి చేసేందుకు ఉన్న ఏ అవకాశాన్నీ భారత్ విడిచి పెట్టడం లేదు. ఇప్పుడు వినోద రంగం విషయంలోనూ భారత్ చర్యలకు ఉపక్రమించింది. వినోదం విషయంలో ఓటీటీలు విప్లవాత్మక మార్పులకు నాంది పలికాయి. భాషా సరిహద్దులను సైతం చెరిపేశాయి. భారత్‌పాక్ మధ్య ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో పాక్ మూలాలున్న ఓటీటీ కంటెంట్‌ను పూర్తిగా నిలిపివేయాలని భారత సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ నిర్ణయించింది. ఈ మేరకు ఓటీటీ ప్లాట్‌ఫాంలకు సూచనలు జారీ చేస్తూ ప్రకటన విడుదల చేసింది. 'జాతీయ భద్రత దృష్ట్యా పాకిస్థాన్ మూలాలున్న ఓటీటీ కంటెంట్, ఓటీటీ వేదికలు, మీడియా స్ట్రీమింగ్ ప్లాట్‌ఫాంలు, మధ్యవర్తిత్వం ద్వారా అయ్యే ఏ ప్రసారమైనా ఇక పూర్తిగా నిలిపివేస్తున్నాం. పాకిస్థాన్ వెబ్‌సిరీస్‌లు, సినిమాలు, పాటలు, పాడ్‌కాస్ట్‌లు సహా మీడియా కంటెంట్ ఏదీ ఇక భారత్‌లో అందుబాటులో ఉండదు.

Printed, Published by Mohammed Murthuza. Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 98660 19778, 89789 60131.